

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్) నిర్మాణాలు.. నాలుగేళ్లుగా పునాదుల దశ దాటలేదు. ఈ కేంద్రాల కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టిన నిర్మాణాలు ఎందుకూ పనికిరాకుండా పోగా.. మిగిలిన నిధులు వృథాగా పోయాయి. జీటీఎస్ భవనాలు, షెడ్ల కోసం వేసిన పిల్లర్ల ఇనుము తుప్పుపట్టిపోయి విరిగిపోతున్నాయి. మున్సిపల్ పట్టణాల్లో సేకరించే చెత్తను జిందాల్‌కు తరలించేందుకు లారీలకు ఎత్తాల్సిన స్టేషన్లలో చెత్తకు బదులు ముళ్ల చెట్లు పేరుకుపోయాయి. 2020 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులతో మొదలుపెట్టిన నిర్మాణాలు ప్రస్తుతం ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఈ కేంద్రాల విలువ తెలుసుకోలేని గత వైసీపీ ప్రభుత్వం అంతే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో మంజూరైన నిధులు వృథా పోగా, ఖర్చు చేసిన నిధులు చెత్తలో పోసిన చందంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్‌తో పాటు మిగిలిన మున్సిపాలిటీలకు కలిపి రూ.256.18 కోట్ల నిధులను ఈ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. వీటిలో ఇప్పటి వరకు రూ.86 కోట్లమేర మాత్రమే ఖర్చు చేశారు.

నిధులున్నా.. నిరుపయోగం



తెనాలి బీసీ కాలనీలో నిర్మించాల్సిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను కంపోస్ట్ యార్డులో కొంతవరకు నిర్మించి వదిలేసిన చిత్రం

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్)ల నిర్మాణం పునాదుల్లోనే...

- గత వైసీపీ సర్కారు నిర్వాకం
- కేంద్రం ఇచ్చినా నాలుగేళ్లుగా నిర్లక్ష్యం
- రూ. 256 కోట్ల పనులు అసంపూర్తిగానే..
- బయో మైనింగ్ విధానంలో చెత్తకు పరిష్కారం దిశగా...



పూలే కాలనీలో షెడ్ వేయకుండా వదిలేయటంతో తుప్పు పట్టిపోతున్న పిల్లర్ల ఇనుము

తెనాలి, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి): చెత్త... రోజురోజుకూ పట్టణాలను పీడిస్తున్న సమస్య. రోజుకు లక్షల టన్నుల చెత్త పట్టణాల్లో పోగవుతుంటే, దానిని తరలించటం, డంపింగ్ యార్డుల్లో ప్రాసెస్ చేయటం వంటివి ఇబ్బందిగా మారిపోయాయి. పైగా చిన్న వాహనాలు పలుమార్లు చెత్తను డంపింగ్ యార్డులకు తరలించటానికి తిరగటం వల్ల ఖర్చు పెరిగిపోతుందన్న కారణంతో ఈ స్టేషన్‌ల నిర్మాణం చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. అనుకున్నట్టే అన్ని రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘ నిధులు, ఇతర నిధులను మంజూరు చేసింది. అయితే వీటిని పట్టణానికి నాలుగు దిక్కులా ఏర్పాటుచేసి, చెత్తను సేకరించాల్సి ఉంటుంది. దీనివల్ల ఎన్నోరకాలుగా ఆదా అవుతుంది. ప్రస్తుత పరిస్థితిలో ప్రతి పట్టణానికి చెత్తను డంప్ చేసే కేంద్రం ఒక్కచోటే ఉంటోంది. పట్టణంలో వచ్చిన చెత్త మొత్తాన్ని అక్కడికే తరలించాలి. అంటే పట్టణంలో అన్ని మూలల నుంచి చెత్త వాహనాలు రోజు మొత్తంమీద 10 నుంచి 15 సార్లు తిరగాల్సి వస్తుంది. పెద్ద నగరాలయితే మరింత శ్రమ. చెత్త సేకరణ చేసే చోటు పలుచోట్ల ఉంటే, ప్రాంతాల వారీగా అక్కడికక్కడే చెత్తను దింపేయవచ్చు. అక్కడి నుంచే చెత్తతో సేంద్రియ ఎరువు, విద్యుత్తు తయారుచేసే కేంద్రాలకు తరలించవచ్చు. మన జిల్లాకు ప్రస్తుతం చిలకలూరిపేటలోని జిందాల్ చేపట్టిన ప్రాజెక్టుకు తరలిస్తున్నారు. ఈ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ఏర్పాటు వల్ల చెత్తను తీసుకొచ్చే వాహనాలు తిరిగే దూరం తగ్గటం వల్ల ఇంధనం ఆదా అవుతుంది. సమయం కలిసివస్తుంది. దీనికితోడు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుంది. చెత్త వాహనాలు జనం తిరిగే సమయంలో వెళితే దుర్గంధంతో వాయు కాలుష్యంకూడా ఏర్పడుతోంది. దీనివల్ల అదికూడా చాలావరకు తగ్గుతుందనేది కేంద్రం ఆలోచన. దీనిని గత వైసీపీ సర్కారు పూర్తిగా పక్కన పెట్టేసింది. అసలు ఈ కేంద్రాల నిర్మాణం పూర్తిచేసిన దాఖలాలే లేవు.

పునాదుల దశలోనే లక్ష్యానికి తుప్పు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్(జి.టి.ఎస్)స్టేషన్‌ల నిర్మాణం పునాదులకే పరిమితమయింది. ఎక్కడా పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగి, ఉపయోగంలోకి వచ్చిన పరిస్థితి లేదు. తెనాలిలో మూడు చోట్ల జీటీఎస్‌ల నిర్మాణం రూ. 2.16 కోట్లతో 2020లో చేపడితే, అవి అస్తవ్యస్తంగా మారాయి. సాధారణంగా డంపింగ్ కేంద్రం ఉన్నచోట కాకుండా, మిగిలిన ప్రాంతాల్లో ఈ కేంద్రాలను నిర్మించాల్సిఉంటే, పట్టణంలోని పూలే కాలనీ, బీసీ కాలనీ, పినపాడులో చేపట్టారు. అయితే ఇక్కడ ఒక్క పినపాడు మినహా, మిగిలిన రెండూ డంపింగ్ యార్డుకు దగ్గర్లోనే ఉండటం విశేషం. దీనిలో బీసీ కాలనీలో నిర్మించాల్సిన స్టేషన్‌ను ఏకంగా యార్డులోనే పెట్టేశారు. ఇక్కడ కంపోస్ట్ యార్డుకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని నిర్మించాల్సిఉంటే, బీసీ కాలనీలో జనం ఒప్పుకోలేదని

(మిగతా 8వ పేజీలో)

సాగునీరు పారుదల కావాల్సిన కాల్వల నిధులపై కూటమి నేతలు కన్నేశారు. ఇప్పటికే ఇసుక.. మట్టి.. రేషన్.. మాఫియాలతో అంటకాగుతున్న కొందరు నేతల కన్ను సాగర్ కాల్వల మరమ్మతులపై పడింది. అధికారం అండతో కొందరు నేతలు రెచ్చిపోతున్నారు. కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయగా అధికారులు వాటికి టెండర్లు పిలిచారు. అయితే వాటిని రద్దు చేసి తమ వారికి కట్టబెట్టాలని కొందరు నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. టెండర్లను రద్దు చేయాలని హుకుం జారీ చేశారని తెలిసింది. ఈ పరిస్థితుల్లో అధికారులు టెండర్లను రద్దు చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ హయాంలో పనులు చేయకుండానే ఆ పార్టీ నేతలు కొందరు బినామీల పేరుతో నిధులు స్వాహా చేయగా అదే బాటలో కూటమి నేతలు పయనిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టలేని దుస్థితిలో జలవనరుల శాఖ ఉంది.



చిలకలూరిపేట మేజర్ కాలువలో పెరిగిన జమ్ము, కంప

కాల్వలపై.. కూటమి నేతల కన్ను



- మరమ్మతులకు నిధుల విడుదల
- టెండర్లు పిలిచిన జలవనరుల శాఖ
- రద్దు చేయాలంటూ నేతల ఒత్తిడి
- నిలిచిపోయిన పనులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో కాలువల మరమ్మతులకు గత ఐదేళ్ల నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం పాడుబెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాల్వల మరమ్మతులకు రూ. 17.69 కోట్ల నిధులు విడుదల చేసి, అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించింది. అయితే పల్నాడు జిల్లాలో కొన్ని చోట్ల ఈ పనులను అధికార నేతలే అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా జలవనరుల శాఖ మరమ్మతులకు సంబంధించి, టెండర్లు కూడా పిలిచింది. వాటికి సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకునే సమయంలో, అధికార పార్టీ నేతల ఒత్తిడితో సదరు అధికారులు టెండర్లను రద్దు చేసినట్టు ప్రచారం. తాము చెప్పే వరకు టెండర్లు ఖరారు చేయడానికి వీలు లేదని అధికారులకు తేల్చి చెప్పడంతో, టెండర్ల దశలోనే మరమ్మతుల పనులు నిలిచిపోయాయని ప్రచారం. టెండర్లు రద్దు అంశాన్ని జలవనరులశాఖ ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి సదరు అధికారులు తీసుకువెళ్లినట్టు సమాచారం. కొందరు నేతలు మరమ్మతు పనులు ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. తమకు చెందిన వ్యక్తుల పేరుపై టెండర్లు దాఖలు చేయించి పనులు చేసుకోవాలన్న ప్రయత్నాల్లో భాగమే టెండర్లు రద్దు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాగర్ కాలువ కింద మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు శిథిల స్థితికి చేరుకున్నాయి. రానున్న రోజుల్లో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు వచ్చే పరిస్థితి ఏర్పడింది. కాలువల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తక్షణావసరమైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. ఈ మేరకు పనులను గుర్తించారు. పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించారు.

సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 302 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ. 17.69 కోట్లు వ్యయం అంచనా వేశారు. లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 76 పనులు, ఇందుకు వ్యయం అంచనా రూ. 4.21 కోట్లు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 101 పనులు, వ్యయం అంచనా రూ. 4.69 కోట్లు. ఓఅండ్ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 62 పనులు



గోవిందాపురం మైనర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

(మిగతా 8వ పేజీలో)

అగ్రవర్ణాలకీ.. రుణం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు వైసీపీ పాలనలో అలంకార ప్రాయంగా మారాయి. రూపాయి నిధులు కూడా ఆయా కార్పొరేషన్లకు అందలేదు. ఆయా వర్గాల సంక్షేమం గురించి ఆలోచించలేదు. అగ్రవర్ణ పేదలకు కేటాయించే రుణాలకు కూడా జగన్ ప్రభుత్వం మంగళం పాడింది. స్వయం ఉపాధి రంగాలలో ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం ఐదేళ్ల పాటు ఆశావహులకు ఎదురుచూపులే మిగిలాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆయా కార్పొరేషన్లకు జవసత్వాలు కల్పించే దిశగా కార్యాచరణ మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే బీసీ రుణాలకు సంబంధించి స్పష్టత ఇచ్చింది. త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలుకానుంది. ఈ క్రమంలో ఈబీసీ కింద అగ్రవర్ణ పేదలకూ 50 శాతం రాయితీ కింద బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలివ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాల వారీగా కేటాయింపులు కూడా జరిపింది.

ఈబీసీ కింద మంజూరుకు సన్నాహాలు

- మూడు జిల్లాల పరిధిలో రూ.96 కోట్లు కేటాయింపు
- ఆరు రంగాలు ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక
- కసరత్తు మొదలు పెట్టిన బీసీ కార్పొరేషన్ అధికారులు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి) అగ్రవర్ణ పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈబీసీ కింద రాయితీపై రుణాలిచ్చే ప్రక్రియ 2014–19 మధ్య కార్పొరేషన్ల ద్వారా జరిగింది. కానీ గత ప్రభుత్వంలో ఆ నిధులను సైతం యథేచ్ఛగా దారి మళ్లించి ఈబీసీ పేదలను దగా చేసింది. 2019--24 మధ్య ఈబీసీకింద స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకోవడానికి రాయితీ రుణాలు మంజూరు చేయాలనే అభ్యర్థనలు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 15,000 వరకు వచ్చినట్లు సమాచారం. వీటిలో ఏ ఒక్క దరఖాస్తును పరిష్కరించకపోగా ఆ నిధులనూ సైతం ఇష్టారీతిన దారి మళ్లించిన ఘనత గత ప్రభుత్వానిది కావడం గమనార్హం

ఆరు రంగాలలో...

రాయితీపై రుణాలు అందించే యూనిట్లను మొత్తం ఆరు రంగాలుగా ప్రభుత్వం వర్గీకరించింది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెయిరీలు, జనరిక్ మందుల షాపులు, హాస్పిటల్ సెక్టార్‌తో పాటు ఇతర స్వయం ఉపాధి యూనిట్ల కింద రుణాలు మంజూరు చేయనున్నారు. ఈబీసీతో పాటు రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ విభాగాలలో అగ్రవర్ణ పేదల కింద లబ్ధిదారులను ఎంపిక జరిపి వారికి లబ్ధి చేకూర్చే విధంగా బీసీ కార్పొరేషన్ కసరత్తు మొదలు పెట్టింది. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఆయా రంగాలలో ఆసక్తి కనబరుస్తున్న వారి నైపుణ్యాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. అవసరమైతే వారికి ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి యూనిట్లను మంజూరు చేసి వారు నిలదొక్కుకునేలా చేయడానికి అన్నివిధాల సహకారం అందించనుంది

మూడు జిల్లాలకు కలిపి రూ.96 కోట్ల రుణాలు

ఈబీసీ కోటా కింద అగ్రవర్ణ పేదలకు రుణాలు మంజూరులో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే నిధులు కేటాయింపు జరుపుతూ బీసీ కార్పొరేషన్ అధికారులకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. దానిలో భాగంగా బాపట్ల జిల్లాలో మొత్తం 3,609 మందికి లబ్ధి చేకూర్చాలని నిర్ణయించింది. నిధుల కేటాయింపు వచ్చేసరికి మొత్తం రూ.23 కోట్లు కాగా ఇందులో సబ్సిడీ కింద రూ.15 కోట్లు పోగా బ్యాంకు రుణం కింద రూ.8 కోట్లు లబ్ధిదారులకు అందించనున్నారు. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాలకు కలిపి మొత్తం 9,838 లబ్ధిదారులను ఈబీసీ కింద ఎంపిక చేసి రాయితీ కింద రుణాలు అందించనున్నారు. మొత్తం రూ.63 కోట్లను ఇందుకు ప్రభుత్వం కేటాయించగా ఇందులో రూ.42 కోట్లు రాయితీ రూపంలోనూ, రూ.21 కోట్లు బ్యాంకురుణాల ద్వారా లబ్ధిదారులకు మేలు జరగనుంది. ఈబీసీ కింద రుణాల విషయంలో రూ.63 కోట్లను గుంటూరు, పల్నాడు జిల్లాలకు కలిపే ప్రస్తుతానికి బీసీ కార్పొరేషన్ చూపిస్తుంది. త్వరలోనే జనాభా ప్రాతిపదికన ఈ కేటాయింపులను రెండు జిల్లాలకు విభజించి ప్రక్రియ మొదలుపెట్టే దిశగా యంత్రాంగం అడుగులు వేయనుంది.

మహిళలకే అగ్ర తాంబూలం

స్వయం ఉపాధి యూనిట్లకోసం రుణాల మంజూరులో భాగంగా మహిళలకే పెద్ద పీట వేయనున్నారు. దానిలో భాగంగానే కేటాయింపుల్లో ఎక్కువ శాతం ఫ్యాషన్ డిజైనింగ్ విభాగానికే కేటాయించారు. ఈ రంగంలో మహిళలకు శిక్షణ ఇవ్వడంతో పాటు యూనిట్ ఏర్పాటుకు ఒక్కొక్కరికి రూ.25,000 చొప్పున నగదు అందించడంతో పాటు కుట్టుమిషన్ కూడా అందించనున్నారు. ఇక ఈవెంట్ మేనేజ్‌మెంట్ కింద రూ.50,000, టూరిజం మేనేజ్‌మెంట్ కింద రూ.25,000 అందించడంతో పాటు ఆయారంగాలలో శిక్షణ కూడా ప్రభుత్వమే ఇప్పించే విధంగా చర్యలు చేపడుతోంది. జనరిక్ మందుల దుకాణాలకు సంబంధించి బీఫార్మసీ తదితర అర్హతలు ఉన్నవారికి శిక్షణ ఇప్పించి యూనిట్ మంజూరు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా నిధుల మంజూరుతో పాటు లబ్ధిదారుల సంఖ్య పై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ చేపట్టి ఎంపి కయిన లబ్ధిదారులతో మాట్లాడడం, శిక్షణ వంటి ప్రక్రియలన్నీ శరవేగంగా పూర్తి చేసి మరో నెల రోజుల్లోనే రాయితీ రుణాల అంశాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది.



జెస్సీరాజ్‌కు పీఎం బాల పురస్కార్ ప్రదానం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జెస్సీరాజ్

6

ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ అలవెన్స్

- వైసీపీ హయాంలో రద్దు
- కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరణ
- ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లలో హర్షాతిరేకాలు

30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

31న యలమందలలో సీఎం పర్యటన

- సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

6



నరసరావుపేట నియోజకవర్గం యలమందలలో సీఎం చంద్రబాబు పర్యటనకు స్థల పరిశీలన చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

స్కామర్ల పంజా!

- ఆందోళనకర స్థాయిలో స్పామ్ మోసాలు
- కొత్తకొత్త పద్ధతుల్లో అక్రమాలకు పాల్పడుతున్న వైనం
- ట్రాయ్‌పేరుతో బెదిరింపు కాల్స్.. ఐవీఆర్ఎస్ ఆప్షన్లతో హ్యాకింగ్

8



డీఆర్ఎంగా ఆనంద్ మధుకర్



గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం)గా ఆనంద్‌మధుకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు డైరెక్టర్ రవీందర్‌పాండే గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీసు (ఐఆర్‌పీఎస్) 1977 సివిల్ సర్వీసు ఎగ్జామినేషన్ బ్యాచ్‌కు చెందిన మధుకర్ కేంద్ర ఆర్థిక శాఖలో కొంతకాలం జాయింట్ సెక్రెటరి హోదా పోస్టులో ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. సౌత్ ఈస్టు రైల్వేలో ఆయన ఎక్కువ కాలం వివిధ హోదాలలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై కేంద్ర పురావస్తు శాఖలో అదనపు డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2029 వరకు డిప్యుటేషన్ ఉన్నప్పటికీ రైల్వేబోర్డు ఆయన్ని వెనక్కు రప్పించి గుంటూరు డీఆర్ఎంగా పోస్టింగ్ చేసింది. కాగా ప్రస్తుత డీఆర్ఎం రామకృష్ణకు ఇంకా పోస్టింగ్ కల్పించలేదు.

జనం దృష్టి మళ్లించేందుకే వైసీపీ దొంగ దీక్షలు

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఒప్పందాల లంచాల కేసుల్లో అడ్డంగా ఇరుక్కున్న వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి జనం దృష్టి మళ్లించేందుకు పోరుబాట పేరుతో దొంగ దీక్షలకు దిగుతున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్‌చార్జీలు పెంచారని, వైసీపీ ప్రభుత్వం రెండు నెలల్లో దిగిపోతూ కూడా పేదలపై పన్నెండున్నర వేల కోట్ల రూపాయల భారం వేసి, ఆ భారంపై ఇప్పుడు దొంగ దీక్షలకు దిగటం హాస్యాస్పదంగా ఉందన్నారు. క్విడ్ ప్రో కోను విద్యుత్ రంగానికి కూడా విస్తరించి అడ్డగోలుగా దోచుకున్న జగన్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ చార్జీలపై పోరుబాటకు పిలుపునివ్వటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకసారి అధికారం ఇచ్చిన పాపానికి ఒకొక్క కుటుంబంపై సగటున రూ.4వేలు భారం మోపారని, ఐదేళ్లలో ప్రజలపై మొత్తం రూ.20వేల కోట్లు భారం వేసింది మరిచిపోయారా అంటూ నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ ఉచిత విద్యుత్‌కు మంగళం పాడింది, విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాన్ని 1.14లక్షల కోట్లకు చేర్చి అప్పుల్లో ముంచి దివాళ తీయించింది జగన్ కాదా అని దుయ్యబట్టారు. పరిశ్రమలకు పవర్ హాలిడేలు, రైతన్నలకు వద్దన్న మీటర్లు పెట్టి విద్యుత్ రంగాన్ని చిమ్మ చీకటిలోకి నెట్టిన వ్యక్తి జగన్మోహనరెడ్డి అన్నారు. జగన్‌ను ఇంకా ప్రజలు నమ్ముతారనుకోవడం భ్రమేనన్నారు. పార్టీని వీడి నాయకులు వెళ్లిపోతుండటంతో పార్టీలో మిగిలింది ఎవరో, తన మాట వినేది ఎవరో తెలుసుకునేందుకే జగన్ పోరుబాట అంటూ పిలుపునిచ్చారని ఎద్దేవా చేశారు. సొంత జిల్లా కడపలో పట్టుమని 10మందిని ఆందోళనకు పోగుచేయలేని వ్యక్తి వైసీపీని నడపడం, కాపాడుకోవడం కూడా అనుమానమేనని అన్నారు.

కరెంటు చార్జీల పెంపు భారం నీది కాదా జగన్..?

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరెంట్ చార్జీల పెంపు పాపం నీది కాదా జగన్ అంటూ టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి, అనాలోచిత విధానాలే విద్యుత్ భారానికి కారణం అని కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ చార్జీల పెంపుపై కలెక్టరేట్ల వద్ద ధర్నా చేస్తానని చెప్పడం చూస్తుంటే తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నా చేయడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి వలన రాష్ట్రంలో రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ భారం పడిందని, విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పుల భారం రూ.49,500 కోట్లు, విద్యుత్ వినియోగదారులపై రూ.32వేల కోట్లు, వీటీపీఎస్, కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ జాప్యం, పోలవరం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు జాప్యం వలన సుమారుగా రూ.17వేల కోట్లు ఇలా మొత్తం విద్యుత్ భారం పెరిగిందన్నారు. ఏపీ డిస్కం నిర్వహణ లోపం వలన, జెన్కో ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి లోపం వలన మొత్తం రూ.1.29లక్షల కోట్ల విద్యుత్ భారం పడిందన్నారు. చేతగాని అసమర్థ, అవినీతి పాలన వలన ఏర్పడిన విద్యుత్ భారం ట్రూ అప్ చార్జీలు, ఎఫ్‌పీసీపీఏ చార్జీలు రూపంలో వినియోగదారులపై పెనుభారాన్ని మోపాయని వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నైట్ అలవెన్స్



● వైసీపీ హయాంలో రద్దు ● కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరణ ● ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్స్‌లో హర్షాతిరేకాలు

గుంటూరు, సత్తెనపల్లి డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్, కండక్టర్స్‌కు కూటమి ప్రభుత్వం తన ఉదారతను చాటుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రద్దయిన నైట్ అవుట్ అలవెన్స్ అమలు చేస్తూ జీవో జారీ చేసింది. గతంలో ఉన్న అలవెన్స్ రూ. 75లను రూ. 150లకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీలో పల్లె వెలుగుతో పాటు ఇతర సర్వీసుల్లో పనిచేసే డ్రైవర్, కండక్టర్స్‌లు ప్రయాణీకులను గమ్య స్థానాలకు చేర్చి అర్థరాత్రి లాస్ట్ సమయంలో ఆ ఊళ్లోనే ఉంటారు. తిరిగి తెల్లవారుజామున మొదటి ట్రిప్పుతో ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చుతుంటారు. ఇలా రాత్రి సమయాల్లో సైతం విధులు నిర్వహించిన డ్రైవర్, కండక్టర్స్‌కు వారికి సాధారణంగా వచ్చే వేతనంతో పాటు అర్థరాత్రులు విధులు నిర్వహించినందుకు అదనంగా గతంలో రోజుకు రూ. 75లు ఇచ్చేవారు. ఈ విధంగా డ్రైవర్‌తో పాటు కండక్టర్స్‌కు కూడా సాధారణ వేతనంతో పాటు నైట్ అవుట్ అలవెన్స్ కూడా వచ్చేవి. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం జరిగింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటంతో వారికి వచ్చే ప్రయోజనాల కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోందని ఉద్యోగుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విలీన క్రమంలో రాత్రులు విధులు నిర్వహించే డ్రైవర్‌లు, కండక్టర్‌లకు వచ్చే నైట్ అవుట్ అలవెన్స్‌ను రద్దు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నంతకాలం వారికి నైట్ అవుట్ అలవెన్స్ ఊసే లేదు. పలు దఫాలుగా ఉద్యోగ సంఘాల నాయకులు తమకు నైట్ అవుట్ అలవెన్స్ ఇప్పించండి మహా ప్రభో అని మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. పైగా ఆర్టీసీని తామేదో ఉద్ధరిస్తున్నామంటూ ఊదరకొట్టుకోవటం తప్ప వారు ఉద్యోగులకు చేసిన మేలు ఏమీ లేదని ఉద్యోగ సంఘాల నాయకుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆర్టీసీకి దశ మారింది. కొత్త బస్సులు కొనటంతో పాటు ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇటీవల ప్రభుత్వ పెద్దలను ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి నైట్ అవుట్ అలవెన్స్ తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తులు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు రూ. 75లుగా ఉన్న నైట్ అవుట్ అలవెన్స్‌ను రూ. 150లకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలో 1500 మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి

తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1500 మందికి పైగా ఆర్టీసీ డ్రైవర్స్, కండక్టర్స్‌కు లబ్ధి చేకూరనున్నట్లు చెబుతున్నారు. డిపోల వారీగా ఉమ్మడి జిల్లాలో 13 డిపోల నుంచి నైట్ అవుట్ విధులు నిర్వహించే వారికి మేలు కలగనుండటంపై డ్రైవర్, కండక్టర్స్‌లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో నైట్ అవుట్ అలవెన్స్ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వం న్యాయం చేశారంటూ వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యలమందలలో సీఎం చంద్రబాబు పర్యటనకు స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు



31న యలమందలలో సీఎం పర్యటన

● సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసరావు పేట నియోజకవర్గంలోని యలమందలలో 31న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను సీఎం చంద్రబాబు నాయుడు పంపిణీ చేస్తారన్న సమాచారంతో సభాస్థలిని అధికారులు గురువారం పరిశీలించారు. చంద్రబాబు నాయుడు పర్యటన తొలుత పులిపాడులో ఉంటుందని ఆ గ్రామంలో ఏర్పాట్లు చేపట్టారు. సీఎం పర్యటన యలమందలకు మారినట్టు అందిన సమాచారం మేరకు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు గ్రామంలో చేపట్టాల్సి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. హెలిప్యాడ్, సభావేదిక కోసం స్థలాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. పులిపాడు, యలమందల ఏ గ్రామంలో సీఎం టూర్ ఉంటుందో ఇంకా స్పష్టత రానట్టు అధికారులు చెబుతున్నారు. అయితే రెండు గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎంవో నుంచి సీఎం పర్యటనపై అధికారికంగా ప్రకటన వెలువడలేదు.

జెస్సీరాజ్‌కు పీఎం బాల పురస్కార్ ప్రదానం

మంగళగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీర బాలల దినోత్సవం సందర్భంగా దేశంలోని సాహస బాలలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాతీయ స్థాయిలో బాల పురస్కార్ అవార్డులను ప్రదానం చేస్తుంది. సాహస కార్యాలు, క్రీడలు, సంస్కృతి, విద్య రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు న్యూఢిల్లీలో గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ అవార్డుల కోసం గుంటూరు జిల్లా నుంచి వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు బాలల దరఖాస్తులను పరిశీలించి కలెక్టరు ఎస్ నాగలక్ష్మి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఏపీ వ్యాప్తంగా అనేక మంది అర్హులైన బాలబాలికలు ఈ అత్యున్నత అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, కేంద్రస్థాయి కమిటీ దరఖాస్తులను పరిశీలించి మంగళగిరికి చెందిన 9వ తరగతి విద్యార్థిని మాత్రపు జెస్సీరాజ్‌ను ఎంపిక చేసింది. బాలికా క్రీడల విభాగంలో ఇటీవల న్యూజిలాండ్ లో నిర్వహించిన ప్రపంచ ఆర్టిస్టిక్ స్కేటింగ్ పోటీల్లో జెస్సీరాజ్ అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. అంతర్జాతీయ స్థాయిలో ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో స్వర్ణ పతకం సాధించినందుకు గాను జెస్సీరాజ్ బాల పురస్కార్-2024 అవార్డుకు ఎంపికైంది. న్యూఢిల్లీలో గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జెస్సీరాజ్ ఈ అవార్డును అందుకుంది. పురస్కారం అందుకున్న జెస్సీరాజ్, తల్లిదండ్రులు ఎం సురేష్, రాధ దంపతులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జిల్లా అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జెస్సీరాజ్

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

● సీఎం నివాసం వద్ద ఘటన



హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య మృతదేహం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి సీఎం నివాసం వద్ద గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. కడప ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌కు చెందిన ఎస్.రాజయ్య (52) ఉండవల్లి చంద్రబాబు నివాసం వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన జ్వరం రావడంతో అస్వస్థతకు గురయ్యారు. తిరిగి గురువారం విధులకు హాజరవ్వగా, ఉదయం పది గంటల సమయంలో గుండెపోటు రావడంతో సహచర సిబ్బంది ఆయన్ని మణిపాల్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మృతిచెందారు.

30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

● పరేడ్ గ్రౌండ్స్‌ను పరిశీలించిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అధికారులతో కలిసి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌ని గురువారం ఆయన పరిశీలించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు మైదానాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ తదితర పరీక్షల నిర్వహణ నిమిత్తం అనువుగా మైదానాన్ని తీర్చి దిద్దాలని అధికారులకు చెప్పారు. కానిస్టేబుల్ అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించినది మొదలు కుని, దేహదారుఢ్య పరీక్షలు ముగించుకుని తిరిగి వెళ్ళే వరకూ వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలని సూచించారు. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు, ఛాతీ, ఎత్తు కొలతలు చూడటానికి, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహణ విషయమై ఏవిధంగా విధులు నిర్వర్తించాలో తగిన సూచనలు చేశారు. పెరేడ్ గ్రౌండ్ పరిశీలనలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, కే సుప్రజ, ఏ హనుమంతు, అద్దంకి వెంకటేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ సీతారామయ్య ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీలు సుప్రజ, రమణమూర్తి తదితరులు

సమీకృత వ్యవసాయ విధానానికి మొగ్గు చూపాలి

● రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

లాంఫాం(తాడికొండ), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెంది నిలదొక్కుకోవడానికి వారు సమీకృత వ్యవసాయ విధానం వైపు మొగ్గు చూపాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డిల్లీరావు తెలిపారు. గురువారం లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిల్లీరావు మాట్లాడుతూ కృషి విజ్ఞానకేంద్రంలో అమలుచేస్తున్న వివిధ రకాల వ్యవసాయ, పశు సంపద, అనుబంధ పరిశోధనల ప్రదర్శన క్షేత్రాలు, క్షేత్రసాయిలో రైతులకు మరింత అవగాహన కోసం దోహదపడతాయన్నారు. కేవీకేల్లో పుట్టగొక్కుల పెంపకం, వాణిజ్యస్థాయిలో వానపాముల ఎరువు తయారుచేసే విధానం, పందుల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. కోళ్లు, చేపల పెంపకంలో మేలైన నూతన యాజమాన్య పద్ధతులను సూచించే విధంగా ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా పరిశోధనలు చేసి వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలన్నారు. రాష్ట్రంలోని వివిధ కేవీకేలలో కన్నా లాం కేవీకే క్షేత్రం మాత్ర మే పశుసంవర్ధక, పశు అనుబంధ పరిశోధనలను క్షేత్ర స్థాయిలో ప్రదర్శనా క్షేత్రాలను సందర్శించుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. రబీ సీజన్‌లో శనగ విత్తే విధానాన్ని పరిశీలించారు. అధిక దిగుబడులను ఇచ్చే నేపియర్ గడ్డి జాతి విత్తన కట్టింగ్స్‌ను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త యుగంధర్, కేవీకే శాస్త్రవేత్త గంగాదేవి, గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



నేపియర్ గడ్డిని రైతులకు పంపిణీ చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

ఎమ్మెల్యే పీఏని.. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం

● నిందితుడిపై పట్టాభిపురం స్టేషన్‌లో కేసు నమోదు

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేను పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పీఏను, అంతేగాక మాధవి నాకు అక్క అవుతుంది. ఆమెతో చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తాను' అంటూ మోసగించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు తురకపాలెం రోడ్డులోని భాగ్యనగర్ మూడో లైన్‌కి చెందిన గోరంట్ల మాలకొండయ్య ఇంటి వద్ద గతంలో షేక్ మహమ్మద్ ఆరిఫ్ అద్దెకు ఉండేవాడు. ఆ విధంగా ఆరిఫ్‌కు మాలకొండయ్యకు మధ్య పరిచయం ఏర్పడింది. కొద్ది నెలల క్రితం ఆరిఫ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని, ఆమె తల్లి వద్ద రూ.18 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు అడగ్గా ఆర్నెల్లు సమయం అడిగాడు. ఉద్యోగం రాలేదు కదా, డబ్బులు ఇవ్వమని బాధితులు అడగడంతో వారిని చంపుతానని బెదిరించాడు. దీంతో బాధితుడు మరింత లోతుగా విచారించగా మరికొంతమంది దగ్గర కూడా ఉద్యోగాల పేరుతో మాలకొండయ్య ఇలాగే డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. దీంతో బాధితుడు పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దెకారు తనఖా పెట్టి మోసం

ఇదిలా ఉంటే నిందితుడు గోరంట్ల మాలకొండయ్యపై మరో చీటింగ్ కేసు నమోదు అయింది. పోలీసుల కథనం మేరకు.. తుఫాన్‌నగర్ ఒకటో లైనుకు చెందిన షేక్ ఖాసిం సైదా ఒక కన్సల్టెన్సీలో పని చేస్తుంటాడు. అయితే నిందితుడు గోరంట్ల మాలకొండయ్య అలియాస్ టెంపర్ తనకు అత్యవసరంగా డబ్బులు కావాలని, తన కారును తనఖా పెట్టుకొని డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఖాసిం సైదా లక్షన్నర ఇచ్చి కారును పెట్టుకున్నాడు. ఆ తరువాత తేజ అనే వ్యక్తి వచ్చి ఆ కారు తనదనీ, మాలకొండయ్య అద్దెకు తీసుకున్నాడని చెప్పి కారును తీసుకెళ్లాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న షేక్ ఖాసిం సైదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు మరో చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతా నుంచి నగదు మాయం

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్తంభాలగరువుకు చెందిన ఉస్మాన్ సయ్యద్ అమెజాన్‌లో ఒక ఆర్డర్ పెట్టాడు. అది నచ్చక రిటర్న్ చేసేందుకుగానూ గూగుల్లో హెల్ప్ లైన్ నంబర్ సెర్చ్ చేశాడు. ఈ క్రమంలో గూగుల్ లో పేర్కొన్న నంబరుకు ఫోన్ చేయగా వారు చెప్పినట్లు చేశాడు. అలా చేయడంతో ఆయన ఖాతా నుంచి విడతల వారీగా సుమారు రూ. 30 వేలు కట్ అయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

53,545 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 49,089 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,545 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 47,637 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14000	334	7500	13500
నెంబరు. 5	9500	12000	నెంబరు.5	8000	11500
273	-	-	273	8000	11500
341	9000	14000	341	10000	13000
4884	11500	11500	4884	10500	10500
సూపర్ 10	8500	12000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	13500	తేజ	8000	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	10000	13800
దేవనూరు డీలక్స్	10000	14000	దేవనూరు డీలక్స్	10000	13500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9500

ఎరువుల వ్యాపారి పరారీ ?

మాచర్లటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఎరువుల వ్యాపారి అప్పులు చేసి పరారైనట్లు సమాచారం. సుదీర్ఘకాలంగా పట్టణంలో నివాసముంటూ ఎరువుల వ్యాపారం చేస్తున్న వ్యక్తి తన బంధువులు, స్నేహితుల వద్ద నుంచి సుమారు రూ.2కోట్లు దాకా అప్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యాపారి ప్రముఖ దేవాలయ సేవా కమిటీలో కీలక పదవిలో కొనసాగుతున్నారు. అయితే తనకున్న స్థిరాస్థులను ఇటీవల విక్రయించుకొని సొమ్ము కూడబెట్టుకున్నట్లు సమాచారం. కాగా అప్పులిచ్చిన వారు అతని కోసం వెతుకులాట ప్రారంభించారు. ఇటీవల పట్టణంలో ప్రైవేటు చిట్టీల వ్యాపారం చేసే ఓ వ్యక్తి కూడా పెద్ద మొత్తంలో అప్పులుచేసి పరారయ్యాడు. అలాగే ఓ మహిళ కూడా తనకున్న అప్పులకు సంబంధించి పలువురికి నోటీసులు జారీ చేసింది.

వందేళ్లుగా పేదల పక్షాన సీపీఐ

● రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు
● దాచేపల్లిలో ఘనంగా శతాబ్ది ఉత్సవాలు

దాచేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) వందేళ్లుగా పేదల పక్షాన నిలబడి, వారి హక్కుల కోసం పోరాడుతూనే ఉందని వంద సంవత్సరాలు నిలబడిన ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గురు వారం దాచేపల్లి నగర పంచాయతీలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండ పంలో సీపీఐ శత వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముప్పాళ్ల మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అండగా వుంది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని అన్నారు.ఆక్రమంలో ప్రాణాలను సైతం అర్పించారన్నారు. కార్యక్రమాలలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, మాచర్ల నియోజకవర్గ కార్యద ర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి, నేతలు కొమెర వెంకట రావు, గుడవల్లి నాగేశ్వరరావు, తెలనాకుల సత్యనా రాయణ, బుర్రి కృష్ణారెడ్డి, డాక్టర్ బుర్రి రంగారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఎస్టీ యూ రాష్ట్ర నాయకులు లింగిరెడ్డి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

గుంటూరు(విద్య),డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నూతన పీఆర్సీ కమిషన్‌ను వేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఎన్‌టీఏ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయిందని, వెంటనే ఉద్యోగస్తులకు నూతన పీఆర్సీ కమిషన్ నియమించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీనాగేశ్వరరావు, గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ సాయి విశ్వనాథ్, పీ లలిత బాబు, గుంటూరు నగర అదనపు కార్యదర్శి టీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాశాఖ సిబ్బందికి శిక్షణా తరగతులు

గుంటూరు(విద్య),డిసెంబరు 26(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులకు, మండల విద్యాశాఖ సిబ్బందికి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ శిక్షణా తరగతులకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. 'లెవెల్ ట్రైనింగ్ టు మండల్ రిసోర్స్ పర్సన్స్ ఆన్ ఎస్ఎంసి యాక్టివిటీస్' అంశంపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు ఈ విషయం గమనించాలని సూచించారు.



నేటి నుంచి ఆర్‌వీఆర్ జేసీలో 'కొలరిడో-2024' నేషనల్ ఫెస్ట్

గుంటూరు(విద్య), డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్ర, శని వారాల్లో 'కొలరిడో - 2024' నేషనల్ ఫెస్ట్ పేరుతో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడల విభాగాలలో జాతీయ స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా దేశంలోని వివిధ కళాశాలల నుంచి ఐదు వేల మందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. విజేతలకు రూ. 5 లక్షల నగదు బహుమతులను అందించనున్నట్లు ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కే మద్దినేని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీసీఎస్ సీనియర్ కన్సల్టెంట్, డెలివరీ పార్టనర్ ఎంఎస్ఆర్ మూర్తి, విశిష్ట అతిథులుగా తెలుగు సినీ తారలు హాజరు కానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ ఇన్‌చార్జి కన్వీనర్ రంగరాయ చౌదరి వెల్లడించారు.

'నమ్ముకున్న వారిని నట్టేట ముంచిన జగన్'

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో పెద్దఎత్తున సమస్యలు సృష్టించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగనే ఇప్పుడు ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు బయలుదేరడం హాస్యాస్పదంగా ఉందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ ఎద్దేవా చేశారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ హయాంలో సృష్టించిన సమస్యలకు తన సొంత నిధులతోనే ఆయన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో సామాన్యులే కాకుండా సొంత పార్టీ కార్యకర్తలు, నేతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రజాదర్బార్ పేరుతో గురువారం పులివెందులలో జగన్మోహన్‌రెడ్డి చేసిన డ్రామాను సొంత ప్రాంత ప్రజలే ఛీ కొట్టారని ప్రజాసేవకు గానీ, రాజకీయాలకు గానీ జగన్ ఎందుకు పనికిరాడనే విషయం మరోసారి తేటతెల్లమైందన్నారు.

3న శరీర అవయవ దాతల సంఘం ఐదో మహాసభ

గుంటూరు మెడికల్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): సావిత్రీ బాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకొని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం ఐదో మహాసభ జనవరి 3న స్థానిక గుంటూరు వైద్య కళాశాల జింకాన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవయవదానం ఉద్యమ స్థాయిలో జరగాలని తెలిపారు. దీనిపై ఇప్పటికే ఈ సంఘం తరపున పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శరీర అవయవదానానికి 13 వేల మంది ముందుకు వచ్చి తమ సమ్మతం తెలియజేసినట్లు ఆయన వివరించారు. అవయవదాతలకు కేంద్ర రైల్వే శాఖ 42 రోజుల స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని అన్నారు. సావిత్రీ బాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మీ మాట్లాడుతూ అవయవదానం చేసే ఉద్యోగులకు, రైల్వే శాఖ ఇచ్చినట్లు స్పెషల్ క్యాజువల్ లీవ్ వంటి సౌకర్యాలు మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలని కోరారు. మూత్రపిండాలు, కాలేయ అవయవదాతలను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహక నగదు అందజేయాలని సూచించారు.

కార్మిక సంఘాలతో ఒప్పందాలు అమలు చేయండి

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గతంలో సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘాలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని, ఇందుకు సంబంధించిన జీవోలు వెంటనే జారీ చేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు, కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని ఉద్దేశించి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నగర అధ్యక్షుడు పూనేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 2023 డిసెంబరు 26 నుంచి 2024 జనవరి 10 వరకు 16 రోజులు సమ్మె జరిగిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ సమ్మె సందర్భంగా ప్రభుత్వం మున్సిపల్ కార్మిక సంఘాలతో ఒప్పందాలు చేసుకుందని, ఆ ఒప్పందాలకు సంబంధించి సంవత్సరం అవుతున్న జీవోలు జారీ చేయకపోవడం కార్మికులను మోసగించడమేనని అన్నారు. 60 సంవత్సరాలు నిండాయని రిటైర్మెంట్ చేసిన ఔట్ సోర్సింగ్ కార్మికులకు 10 సంవత్సరాలు సర్వీస్ ఉన్న వారికి రూ. 75 వేలు, పదేళ్లకు పైబడి సర్వీసు ఉన్న వారికి సంవత్సరానికి రూ.2000 కలిపి చెల్లిస్తామని, తదితర హామీలు నేటికీ అలాగే మిగిలిపోయాయని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపుదలకు 9 మంది ఐఏఎస్ అధికారులతో కమిటీ వేశారని, ఆ కమిటీ రిపోర్ట్ ఏమైందని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం జీతాలు పెంచి చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించి మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా వర్తింపజేయాలని అన్నారు.

ధర్నా అనంతరం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు కుంభా శివయ్య, కాళంగీ భాగ్యరాజు, కారసాల శౌరమ్మ, పచ్చల సామ్రాజ్యం, షేక్ రసూల్, అబ్దుల్ హలీమ్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, సురేష్, భూలక్ష్మి, మీసాల వెంకటేశ్వర్లు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

వంగవీటి మోహన రంగాకు ఘన నివాళి

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది అభిమానం రంగాకే సొంతమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. రంగా వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక శ్రీనివాసరావుపేటలోని అచ్చయ్య డాబా సెంటర్‌లో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహానికి కాపు నేతలతో కలిసి పూల మాలలు వేసి ఆమె ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట ఇస్తే ప్రాణం పోయే వరకూ పోరాడే వ్యక్తి రంగా అని కొనియాడారు. రంగా ఆశయాల కోసం మనం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కొర్రపాటి నాగేశ్వరరావు, ఆళ్ళ హరి, నాగూర్ వలి, నిమ్మల వెంకట రమణ, మేళం సైదయ్య, యాకోబు, మామిడి రామారావు, వెంకట సాయి,చాంద్, రవీంద్ర,నాజర్ వలి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.


రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

నిరుపేదలకు అండగా నిలిచిన రంగా

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి, నిరుపేదలకు అండగా ఉండి వారి గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయిన నాయకుడు వంగవీటి రంగా అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. వంగవీటి రంగా 36వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రంగా విగ్రహాలకు పూల మాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు పాటుపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, శంకురి శీను, జాగర్లమూడి శీను, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, కోట పిచ్చిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్

రాజకీయాల్లో మహోజ్వల శక్తి రంగా

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో వంగవీటి మోహన రంగ మహోజ్వల శక్తి అని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. స్థానిక పాతగుంటూరులోని బాలాజీ నగర్, శ్రీనివాసరావుపేటలోని రంగా విగ్ర హాలకు పూలమాలలు వేసి మేయర్ నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ, రంగా ఎంతో కాలం రాజకీయాలలో లేరని, చాల తక్కువ వ్యవధిలోనే ఆయన ఒక ప్రజా నాయ కుడిగా ఎదిగారన్నారు.


పాతగుంటూరులో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు

రాజీవ్ గాంధీభవన్‌లో..

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అంచలంచలుగా ఎదిగి ఎమ్మెల్యేగా పేదలకు అండగా నిలిచిన వంగవీటి మోహన రంగా జీవితం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వర రావు ప్రశంసించారు. స్థానిక రాజీవ్ గాంధీభవన్‌లో గురువారం వంగవీటి చిత్రం పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గద్దం పాల్‌విజయ్‌కుమార్, కట్టా జవహర్‌బాబు, యన్నం సుధీర్‌బాబు, అనిల్, రవి పాల్గొన్నారు.


రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈశ్వరరావు తదితరులు

● స్థానిక పాతగుంటూరు ఆంజనేయస్వామి ఆలయ సెంటర్‌లోని వంగవీటి మోహన రంగా విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి పూలమాలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబటి రత్తయ్య, షైలా కిరణ్; రామకృష్ణ, సాంబశివరావు, మోషే, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన సత్రం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

అన్నదాన సత్రం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే గళ్లా మాధవి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాదాయ, ధర్మదాయ శాఖ రూ.1 కోటి నిధులతో 2 హాల్స్ 11 రూముల నిర్మాణాలకు శంకు స్థాపన చేసినట్లు చెప్పారు. పూర్వం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాట సారులు వసతి, భోజన సౌకర్యాలకు తీవ్రంగా ఇబ్బంది పడే వారన్న విషయం గ్రహించిన పాటిబండ్ల రఘుపతి నాయుడు అనే దాత, 1.57 ఎకరాల స్థలాన్ని కేటాయించి ఈ సత్రం ఏర్పాటు చేశారని, అది ఆయనను చిర స్థాయిలో నిలిపిందని అన్నారు. ఈ నిర్మాణాలు పూర్త యితే వితంతువులకు వసతితో పాటు, దశ దిన కర్మల కార్యక్రమాలు చేసుకోవడానికి నామమాత్రపు అద్దె చెల్లిస్తే చాలు అని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, కన్నసాని బాజీ, యర్రాకుల శ్రీనివాసరావు,పవన్ వెంకి, గ్యాలెం హనుమంతరావు,విజయలక్ష్మి, సుఖవాసి శ్రీని వాసరావు, కన్నసాని రాజా, కొల్లి అనిల్ పాల్గొన్నారు.

వంట గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు పాటించండి

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ వాడే సమయంలో ప్రజలందరూ తగిన జాగ్రతలు పాటించాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. స్థానిక గుజ్జనగుండ్ల పల్లెలోని చర్చి సమీపంలోని ఓ ఇంట్లో గురువారం గ్యాస్ లీకై ఇల్లు దగ్ధమైన ఘట నలో బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. బాధిత కుటుంబం నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ ఇంట్లో సుమారు 12 మంది నివస్తున్నారని, గ్యాస్ లీకై మంటలు చెలరేగడం గ్రహించిన కుటుంబ సభ్యులందరూ ఇంటి బయటకు వచ్చి, అగ్నిమాపకశాఖ వారికి సమాచారం ఇవ్వడంతో ప్రమాదం తప్పిందని ఎమ్మెల్యే తెలిపారు. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని, బాధితులకు తక్షణం పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, కే ఓపీ ఫౌండేషన్ ప్రతినిధులు

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రోజురోజుకి పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కేఓపీ ఫౌండేషన్ గురువారం ఈ-వ్యర్థాల నిర్వహణపై రూపొందించిన వాల్ పోస్టర్‌ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 28న రతన్ టాటా జయంతి సందర్భంగా కేఓపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ లోని క్రోమా షోరూమ్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అందిస్తే వారి పేరుతో ఒక మొక్కను నాటి, ఈ-సర్టిఫికెట్ అందిస్తారన్నారు. ఈ-వ్యర్థాల నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, కనుక నగర ప్రజలు తమ ఇంటిలో వినియోగంలో లేని మొబైల్స్ కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అందించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కేఓపీ ఫౌండేషన్ చైర్మన్ బీ నిశ్చల్, గుంటూరు రౌండ్ టేబుల్ సభ్యులు జే రాము, ఏ రాకేష్, ఏ వంశీ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఓసీ జారీ చేయం

నూతనంగా నిర్మించే బహుళ అంతస్తు భవన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక గోరంట్లలో ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. సెట్ బ్యాక్, రోడ్డు కొలతలు, ర్యాంప్‌లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


బిల్డింగ్ నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్

గోరంట్ల ఐలా సర్వీస్ సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గోరంట్ల ఐలా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడిగా కడియాల విజయబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన ఎన్నికలలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా డొగిపర్తి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా సేగు వెంకట కోటేశ్వరరావు, కోశాధికారిగా దాచేపల్లి కాశీ విశ్వేశ్వరరావు, ఈసీ సభ్యులుగా చిరుమామిళ్ల వెంక టేశ్వరరావు బొడ్డు నాగేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ కే మంగాదేవి మాట్లాడుతూ సర్వీస్ సొసైటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవం కావడం సంతోషకరమన్నారు. సర్వీసులకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్న ఆటోనగర్ ఆఫీసులో సంప్రదించాలని, తాను పని వేళల్లో అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ ఆటో నగర్ కమిషనర్ మోహన కృష్ణారావు, ఎన్నికల అధికారి ఏ సాంబశివరావు, కార్పొరేటర్ ఎన్. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సమస్యలపై చర్చించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 2న జరిగే క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షన్ల సమస్యలపై చర్చించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. స్థానిక మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్ల బకాయిలుతో పాటు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ బిల్లుల విడుదలపై ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. 12వ వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు.

కోస్టల్ బ్యాంక్ శాఖలో ఉచిత వైద్య శిబిరం


గుంటూరు మెడికల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఆ బ్యాంక్ శాఖలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ వైద్యశిబిరంలో ప్రజా వైద్యశాల అధినేత డాక్టర్ నిమ్మల శేషయ్యతో పాటు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ శివ శంకరయ్య వైద్య బృందం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వ హించారు. శిబిరంలో సుమారు 200 మంది వైద్య సేవలు పొందారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ కోస్టల్ బ్యాంక్ ఖాతా దారులకు మెరుగైన సేవలు అందిస్తూ భవిష్యత్తులో మరిన్ని మైలురాళ్లు అధిగమించా లని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ బృందావన్ గార్డెన్స్ శాఖ మేనేజర్ షేక్ గౌస్‌బాషా, ప్రజావైద్యశాల ఫార్మసిస్టు కే వెంకటరమణ, ల్యాబ్ టెక్నీషియన్ శేషు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ శేషయ్య

మూడు ఆలయాల్లో హుండీల లెక్కింపు పూర్తి

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): స్థానిక లాలాపేట గ్రూపు దేవాలయాల పరిధిలోని మూడు ఆలయాల్లో హుండీల లెక్కింపు పూర్తి చేసినట్లు గురువారం గ్రూప్ దేవాలయాల ఏసీ, ఈవో సుభద్ర తెలిపారు. జగన్నాథస్వామి దేవస్థానంలో రూ.7,589, ఆంజనేయ స్వామి దేవస్థానంలో రూ.3,12,797, వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో రూ. 4,77,915 చొప్పున మూడు ఆలయాల్లో మొత్తం రూ.7,98,301 ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు.


హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

బాలికా సదన్‌లో వీర బాలల దినోత్సవం

గుంటూరు సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీర బాలల దినోత్సవం సందర్భంగా గుంటూరు బాల సదన్‌లో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, పద్య పఠనము, కథలు చెప్పడం తదితర విభాగాలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణాధికారి సీహెచ్ విజయ్ కుమార్, జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ సూపరింటెండెంట్ ఎంఎస్ మూర్తి పాల్గొన్నారు.


సఖి సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు వినీత

సఖి,వన్ స్టాప్ సెంటర్‌లో తనిఖీ

గుంటూరు సిటీ, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సఖి, వన్ స్టాప్ సెంటర్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత గురు వారం తనిఖీ చేశారు. కార్యా లయంలోని రికా ర్డులను పరిశీలించారు. బాధితులకు నష్టపరిహారం అందు తున్న వివరాలను సేకరించారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కే శాంతి భూషణ గోపి పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓనర్ షిప్ కార్డులు

● 234 గ్రామాల్లో 'స్వామిత్వ' సర్వే
● ప్రతీ ఆస్తికి ప్రాపర్టీ పార్సిల్ నంబర్
● 63 గ్రామ పంచాయతీల మ్యాప్‌లు సిద్ధం
● జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్



గుంటూరు సిటీ, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రారం భించిన స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న ప్రతీ ఇంటినీ కొలిచి ప్రభుత్వం ఓనర్ షిప్ కార్డులు ఇవ్వనుంది. ప్రభుత్వమే ప్రతి గ్రామంలోని ఇళ్లను, ఖాళీ స్థలాలను డ్రోన్, రోవర్స్ ద్వారా సర్వే చేయించి కచ్చితమైన కొలతలతో ఈ కార్డులను అందజేయనుంది. దానివల్ల ఆస్తి యజమానికి మిక్కిలి ప్రయోజనాలు జరగనున్నాయి. ఆస్తి వివాదాల పరిష్కారానికి ఇది చక్కటి నమూనా కానుంది. ఈ కార్యక్రమం సాగుతున్న తీరుపై జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్ వివరాలు వెల్ల డించారు.

స్వామిత్వ కార్యక్రమం ఎన్ని గ్రామాల్లో జరుగుతుంది ?

జిల్లా పంచాయతీ అధికారి: గుంటూరు జిల్లాలోని 234 రెవెన్యూ గ్రామాల్లో స్వామిత్వ కార్యక్రమం జరుగుతుంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వే పూరయింది. 63 గ్రామపంచాయితీలకు సంబంధించిన మ్యాప్‌లు సిద్ధమయ్యాయి.

ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది ?

జిల్లా పంచాయతీ అధికారి: ఇప్పటికే 13 పంచాయతీలు, 3 శివారు గ్రామాల్లో ఈ సర్వే పూర్తయింది. ఆయా గ్రామాల్లో ఓనర్‌షిప్ కార్డుల పంపిణీ జరుగుతుంది.

ప్రస్తుతం ఏ ఏ గ్రామాల్లో పూర్తి స్థాయి సర్వే జరుగుతోంది?

జిల్లా పంచాయతీ అధికారి: మొత్తం 63 గ్రామాలకు చెందిన మ్యాప్‌లు వచ్చాయి. 8 గ్రామాల్లో రోవర్స్‌తో సర్వే చేస్తున్నాం. మేడికొండూరు మండలంలోని పాలడుగు, డోకిపర్రు, పెదనందిపాడు మండలంలోని అనపర్రు,కొప్పర్రు, వట్టిచెరుకూరు మండలంలోని కారంపూడిపాడు, కుర్నూతల, ప్రత్తిపాడు మండలం లోని గనికపూడి, నడింపాలెంలలో సర్వే జరుగుతోంది.

రోవర్స్‌తో ఒక్కో రోజు ఎన్ని ఇళ్లు సర్వే చేస్తున్నారు?

జిల్లా పంచాయతీ అధికారి: సుమారు 50 ఇళ్ల వరకు పూర్తి చేస్తున్నారు. వర్షం లేకపోతే మరిన్ని ఇళ్లను సర్వే చేసే అవకాశం ఉంది.

ఇప్పటివరకు ఎన్ని ఇల్లు పూర్తి అయ్యాయి ?

జిల్లా పంచాయతీ అధికారి: జిల్లాలో ఇప్పటివరకు 944 గృహాలు సర్వే పూర్తయింది. సర్వే పూర్తయిన వారికి ఓనర్ షిప్ కార్డులు పంపిణీ చేస్తాము.

స్వామిత్వ వల్ల ప్రయోజనం ఏమిటి?

జిల్లా పంచాయతీ అధికారి: 'స్వామిత్వ' వల్ల ప్రజలకు చాలా ఉపయోగం ఉంటుంది. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికీ ఓనర్ షిప్ కార్డులు అందజేస్తారు. అందులో ఇంటికి సంబంధించిన పూర్తి కొలతలు, హద్దులు ఉంటాయి. దానివల్ల ఆస్తి వివాదాలు ఏర్పడవు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేసే విషయంలో పంచాయతీ యంత్రాంగం సిద్ధంగా ఉంది. సర్వే శాఖ కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తోంది.



వివరాలు తెలియజేస్తున్న వైద్య నిపుణులు

కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో క్లిష్టమైన ఉదర శస్త్రచికిత్స

● యువకుడి ప్రాణాలు కాపాడిన వైద్యులు


గుంటూరు మెడికల్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉదరంలో ఇనుప కడ్డీలు దిగి అంతర్గతంగా రక్తస్రావంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఆసుపత్రికి తెచ్చిన యువకుడికి క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు కిమ్స్ శిఖర హాస్పిటల్‌కు చెందిన సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ రావెళ్ల విష్ణుప్రసాద్ తెలిపారు. స్థానిక మంగళదాస్‌నగర్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాచర్లకు చెందిన యువకుడు వెంకటరమణ (30) ద్విచక్ర మోటారు వాహనంపై వెళుతుండగా, ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కాలువ లోని ఇనుప కడ్డీలపై పడ్డాడు. ఈ ఘటనలో ఇనుప కడ్డీలు అతడి పొత్తి కడుపులోకి చొచ్చుకుపోయాయి. ఉదరంలో కీలక అవయవాలు దెబ్బతిన డంతో పాటు రక్తస్రావం జరిగింది. బాధితుడిని వెంటనే కిమ్స్ శిఖర హాస్పిటల్‌కు తరలించారు. ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ రావెల విష్ణుప్రసాద్, ఇతర వైద్య బృందం క్లిష్టమైన శస్త్ర చికిత్సతో ఆ ఇనుప కడ్డీని తొలగించారు. ఉద రంలో దెబ్బతిన్న భాగాలను సరిచేశారు. వెంకట రమణ పరిస్థితి మెరుగవ్వడంతో గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ మాలెంపాటి రాజశేఖర్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ భరత్ పాల్గొన్నారు. తమ బిడ్డకు ప్రాణదానం చేసిన వైద్యులకు రోగి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకట రమణ

విద్యార్థులు ఎంచుకున్న మార్గాన్ని ప్రోత్సహించాలి

● జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి

వట్టిచెరుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎంచుకున్న మార్గాన్ని ప్రోత్సహించాలే గాని వారిపై ఒత్తిడి చేయటం ద్వారా అనేక అనర్థాలకు దారితీస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులకు గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి హితవు పలికారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి లాంచనంగా తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందరాచారి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడితే తమ లక్ష్యాన్ని సులభతరంగా చేరుకోవచ్చన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు, వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో కళా శాల డైరెక్టర్ డాక్టర్ డీ శ్రీనివాసకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సుధాకరరావు, ఫార్మసీ విభాగాధిపతి జీ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మలినేనిలో ఫార్మసీ తరగతుల ప్రారంభానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సుందరాచారి

ఉచిత వైద్య శిబిరం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహా భాగ్యమని పైకేర్ సాఫ్వేర్ కంపెనీ చైర్మన్ పెండ్యాల శ్రీమన్నారాయణ తెలిపారు. కోస్టల్ బ్యాంకు లోకల్ ఏరియా కొత్తపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో గుంటూరు రుమటాలజీ, న్యూమరాలజీ సెంటర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగరు, బీపీ, జనరల్ చెకప్ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపేట కోస్టల్ బ్యాంకు మేనేజర్ తెళ్ళ సుబ్బారావు, డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మండల పూజ మహోత్సవం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లారెడ్డినగర్ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ 14వ మండల పూజ మహోత్సవాలు గురువారం వేడుకగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అష్ట ద్రవ్య గణపతి హోమం, నవ కలశారాధన, అయ్యప్పస్వామికి మహాకలశాభిషేకం, అయ్యప్ప హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.

స్కామర్ల పంజా!

- ఆందోళనకర స్థాయిలో స్కామ్ మోసాలు
- కొత్తకొత్త పద్ధతుల్లో అక్రమాలకు పాల్పడుతున్న వైనం
- ట్రాయ్‌పేరుతో బెదిరింపు కాల్స్.. ఐవీఆర్ఎస్ ఆప్షన్లతో హ్యాకింగ్
- కొరియర్, ఈ- కామర్స్ సంస్థల పేరుతో టోకరా
- డెలివరీ మిస్సింగ్ అని మెసేజ్‌లు.. లేఖలు
- వివరాల కోసమంటూ క్యూఆర్ కోడ్లు.. స్కాన్ చేస్తే ఇక అంతే!
- యూపీఐ ద్వారా నగదు పంపి కొత్త పద్ధతిలో దోపిడీ
- సాక్షాత్తు హోమ్ శాఖే రంగంలోకి దిగి సంరక్షణ చర్యలు





స్కామర్లు ఇళ్ల దగ్గర పడేసిన లెటర్.. ఇన్‌సెట్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమంటున్న దృశ్యం

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. వాటిని కట్టడి చేయడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలకు సవాలు విసురుతూ కొత్త కొత్త పద్ధతుల్లో స్కామర్లు సామాన్య ప్రజలపై విరుచుకుపడుతున్నారు. పాత పద్ధతులపై అవగాహన కల్పిస్తూ వస్తున్న అధికార యంత్రాంగానికి, ఆ ప్రక్రియ పూర్తి కాకముందే కొత్త అవతారమెత్తి స్కామర్ జనం సొమ్ము దోచుకుపోతున్నాడు. ఒకప్పుడు ఓటీపీలతో దోచుకున్న స్కామర్ ఇప్పుడు వాటితో కూడా పనిలేని అధునాతన పద్ధతుల్లో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే కొత్త పద్ధతుల్లో చెలరేగిపోతున్నాడు. రోజుకో అవతారమెత్తుతున్న ఆన్‌లైన్ మోసగాళ్లను చూసి సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ఏ రూపంలో ఆన్‌లైన్ మోసగాడు తమపై వల విసురుతాడో.. తమ నగదును ఎలా కాజేస్తాడో తెలియక సతమతమవుతున్నాడు.

క్యూ ఆర్ కోడ్‌తో దోపిడీ..

ఇటీవల ఒక ఇంటి డోర్ వద్ద ఒక లేఖ కనిపించింది. ఆ లేఖలో ఆ ఇంటివారు ఆర్డర్ చేసిన ప్రొడక్ట్ డెలివరీ మిస్ అయిందని, ఒక కొరియర్ సంస్థ పేరుతో ఆ లేఖ వచ్చింది. ఆ లేఖలో వే బిల్ నెంబరు, తేదీ మాత్రమే ఇచ్చి సారీ ఉయ్ మిస్ యూ.. అని ఉంటుంది. ప్రొడక్ట్ వివరాలు, మిస్సింగ్ కారణాలు తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి అని మెసేజ్ ఉంది. ఆ ఇంట్లోవారు ఎవరూ ఏమీ ఆర్డర్ చేయకపోవడంతో వారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయలేదు. స్థానికంగా ఉన్న పోలీసులను సంప్రదించగా అది ఆన్‌లైన్ మోసగాళ్ల పని అని నిర్ధారించారు. ఆ లేఖలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉంటే వారి యూపీఐ ఖాతా హ్యాక్ అయిపోతుంది. మోసగాళ్లకు యాక్సెస్ లభిస్తుందని, అలా జరిగితే వారి ఖాతా మొత్తాన్ని మోసగాళ్లు కాజేస్తారని తెలియజేశారు.

యూపీఐ ద్వారా నగదు పంపి..

యూపీఐ ద్వారా నగదు పంపి వారి యూపీఐ అకౌంట్‌ను హ్యాక్ చేస్తారు. దీనికోసం 'జంప్డ్' అనే కొత్తటెక్నిక్‌ను వినియోగిస్తున్నారు. మొదట ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం లేదా ఏ ఇతర యూపీఐ మొబైల్ యాప్ ద్వారా స్కామర్లు మన బ్యాంకు ఖాతాకు నగదు పంపుతారు. దీంతో మన బ్యాంకు ఖాతాలో నగదు డిపాజిట్ అయినట్లు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే ఆ నగదు ఎలా వచ్చింది? ఎవరు పంపారు? బ్యాలెన్స్ పెరిగిందా? అని తెలుసుకోవాలన్న కారణంగా ఎవరైనా యూపీఐ యాప్‌లో చెక్ చేసుకుంటారు. అదే స్కామర్లకు అవకాశం. స్కామర్ నగదు పంపిన వెంటనే విత్‌డ్రా చేసుకునేందుకు రిక్వెస్ట్ సిద్ధం చేస్తాడు. ఎప్పుడైతే యూపీఐ యాప్‌లో పిన్ నెంబర్‌ను ఎంటర్ చేస్తారో.. అప్పుడు స్కామర్‌కు నగదు విత్‌డ్రా చేసుకునేందుకు యాక్సెస్ వస్తుంది. అంతే ఇక బ్యాంకు ఖాతా మొత్తం కాళీ అయిపోతుంది. అందువల్ల ఇలా నగదు పడిన వెంటనే యూపీఐలో చెక్‌చేసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ చెక్ చేసుకోవాల్సి వస్తే అవతలి వ్యక్తి మనకు నగదు పంపినట్లు ఫోన్ చేసి తెలియజేస్తేనే చెక్ చేసుకోవాలని చెబుతున్నారు. లేదు విధిలేని పరిస్థితిలో చెక్ చేసుకోవాలని పిస్తే తొలుత తప్పుగా పిన్ ఎంటర్ చేయాలి. అప్పుడు స్కామర్ రిక్వెస్ట్ రెజెక్ట్ అవుతుంది. ఆ తరువాత ఒరిజినల్ పిన్‌తో బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు అని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఫైల్స్ పంపించి దోపిడీ..

మొబైల్ యాప్‌లకు అనేక రూపాల్లో స్కామర్లు ఫైల్స్ పంపుతున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు తమ మొబైల్స్‌లో రకరకాల అప్లికేషన్లను డౌన్లోడ్ చేసుకుంటుంటారు. దాన్ని ఆసరా చేసుకుని అనేక అప్లికేషన్ ఫైళ్లను స్కామర్లు మన మొబైల్ ఫోన్లకు పంపిస్తారు. వాటిని డౌన్లోడ్ చేసుకునేందుకు క్లిక్ చేసుకుంటే నష్టం తప్పదు. వాటి ద్వారా మన సమాచారం మొత్తం స్కామర్ల చేతికి వెళ్లిపోతుంది. బ్యాంకు ఖాతాలు హ్యాక్ అవుతాయి. సామాన్యులకు అత్యంత అవసరమైన పథకాలు, బ్యాంకులు, ఆధార్ పేర్లతో ఆ ఫైల్స్‌ను పంపుతున్నారు. ఉదాహరణకు ఆధార్. ఏపీకే, ఎస్‌బీఐ. ఏపీకే, పీఎం కిసాన్. ఏపీకే, యూనియన్ బ్యాంక్. ఏపీకే పేరుతో పంపిస్తారు. ఇలా 'డాట్ ఏపీకే' అనే పేరుతో వచ్చే ఫైల్స్‌ను ముట్టుకుంటే ఫోన్ హ్యాక్ అయిపోయినట్లే లెక్క. కాబట్టి ఇలాంటి ఫైల్స్‌ను ఎవరూ టచ్ చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఐవీఆర్ కాల్ రూపంలో..

ఇప్పటి వరకూ వెలుగు చూసిన దోపిడీల్లో ఇది అతి పెద్ద దోపిడీ. మీరు ఫోన్ నెంబరును దుర్వినియోగం చేస్తున్నారు. అందువల్ల మీ నెంబరును మరో 2 గంటల్లో బ్లాక్ చేస్తున్నాం. దాన్ని ఆపాలంటే 1 నొక్కండి! వివరాలు తెలుసుకోవడానికి 9 నొక్కండి! పూర్తి సమాచారం కావాలంటే 2 నొక్కండి! అంటూ ట్రాయ్ పేరుతో ఐవీఆర్ఎస్ విధానంలో బ్యాంకుకు లింకై ఉన్న ఫోన్ నెంబర్లకు కాల్స్ వస్తాయి. ఆ ఆప్షన్ల ప్రకారం ఏ నెంబరు నొక్కినా ఇక అంతే సంగతులు. దాని ద్వారా మొబైల్ హ్యాక్ అయిపోతుంది. అందులోని మనీ యాప్‌లు స్కామర్ల చేతికి వెళ్లిపోతాయి. తాము ఈడీ, సీబీఐ, కస్టమ్స్, ఇన్‌కమ్ టాక్స్, పోలీస్ అధికారులమని చెప్పి భయపెట్టి విచారణ కోసమంటూ బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకుని ఖాతా ఖాళీ చేస్తారు. ట్రూ కాలర్లో కూడా ఆయా సంస్థల పేర్లు పడడంతో ఆందోళన చెంది అందరూ ఆ నెంబర్లు నొక్కుతారు. మోసపోతారు. అలాంటి కాల్స్ ఏవి వచ్చినా ఫోన్లు ఎత్తవద్దని ట్రాయ్ హెచ్చరిస్తోంది. గతంలో ఇండియా కోడ్ +91తో కాకుండా ఇతర విదేశాల కోడ్లతో కాల్స్ వచ్చేవి. ఆ కారణంగా కొద్దోగొప్పో చదువుకున్నవారు, అవగాహన వున్నవారు కోడ్‌ను పసిగట్టి జాగ్రత్త పడేవారు. ఇప్పుడు +91 కోడ్‌తోనే కాల్స్ వస్తున్నాయి. గుర్తించడం కష్టం. అందువల్ల కాల్ లిఫ్ట్ చేసినా వాళ్లు చెప్పే ఇతర నెంబర్లు మాత్రం నొక్కవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హోమ్‌శాఖ నుంచి హెచ్చరికలు

ఇటీవల ట్రాయ్ అధికారి పేరుతో వచ్చిన ఒక ఫేక్ కాల్ కారణంగా బెంగళూరుకు చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తి 11 కోట్ల 83లక్షల రూపాయలు కాజేశారు. మీ మీద మనీ ల్యాండరింగ్ కేసు నమోదయింది. మీ అకౌంట్‌ను డిజిటల్ లాక్ చేస్తున్నామని చెప్పి అతడి ఖాతాను హ్యాక్ చేశారు. విచారణ కోసం బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. అతడు వివరాలు ఇవ్వడంతో అతడి ఖాతా నుంచి రూ. 11.83 కోట్లు కాజేశారు. ఇదంతా మోసమని తాను గ్రహించే సరికే ఆ నష్టం జరిగిపోయింది. దీంతో అతడు పోలీసులను ఆశ్రయించాడు. సంచలనం సృష్టించిన ఈ విషయం తర్వాత హోమ్ శాఖ అప్రమత్తమయింది. ఇప్పుడు ప్రతి కాల్‌కు ముందు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఈడీ, కస్టమ్స్, జడ్జిలు, పోలీసుల పేరుతో ఎవరు కాల్ చేసినా ఆందోళన చెందవద్దని, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని హెచ్చరిస్తోంది. దాంతోపాటు నేషనల్ పోలీస్ హెల్ప్‌లైన్ 112, నేషనల్ విమెన్ హెల్ప్‌లైన్ 181 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

> ● మంగళగిరిలో ఒకరికి ట్రాయ్ పేరుతో కాల్ వచ్చింది. మీ నెంబరు దుర్వినియోగం చేశారు. దాన్ని మరో రెండు గంటల్లో రద్దు చేస్తాం.. ఆపాలంటే 9 నొక్కండి. వివరాలు తెలుసుకోవాలంటే 2 నొక్కండి అంటూ చెబుతోంది. ఆ కాల్ వెనుక ఏదో మోసం ఉందని గ్రహించి సదరు వినియోగదారు కాల్ కట్ చేసి ఫిర్యాదు చేశారు.

> ● మంగళగిరిలో ఒకరి ఇంటి వద్ద లెటర్ బాక్స్‌లో ఒక కవర్ కనిపించింది. అందులో మీ ఆర్డర్ మిస్ అయినందుకు చింతిస్తున్నాం. ఆర్డర్‌ను పంపించాలంటే కింద వున్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి అని ఉంది. అతడు ఏమీ ఆర్డర్ చేయకపోవడంతో అందులో ఏదో మోసం ఉందని దాన్ని చించేశాడు. కాగా ఇటీవల కర్ణాటకకు చెందిన ఒక బడా వ్యాపారి ఇలా నెంబర్లు నొక్కిన కారణంగా అతడి ఖాతా నుంచి రూ. 11 కోట్లు నష్టపోయాడు. దీంతో కేంద్ర హోమ్ శాఖే రంగంలోకి దిగాల్సి వచ్చింది.

> ● ఇలాంటి స్కాముల బారిన పడి ఈ ఏడాది సెప్టెంబరులో పెదకాకాని స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 91 లక్షలు, పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.27 కోట్లు కోల్పోగా, అక్టోబరులో పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.03 కోట్లు, పాతగుంటూరు స్టేషన్ పరిధిలో ఒకరు రూ. 1.25 కోట్లు నష్టపోయినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం

- శ్రేణులకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ దిశానిర్దేశం



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవం గుంటూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ స్టేడియం నుంచి గాంధీపార్కు వరకు సీపీఐ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. అనంతరం గాంధీపార్కు వద్ద గురువారం జరిగిన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి కే రామకృష్ణ ప్రసంగిస్తూ రాజ్యాంగాన్ని పరిరక్షిం చడానికి, లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు, సమసమాజ స్థాపనకు త్యాగాలు, పోరాటాలకు సమాయత్తం కావాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యచరణ రూపొం దిస్తున్నామన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. సీపీఐ పోరాటాల ఫలితంగానే భూ సంస్కరణ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనువాదాన్ని అమలుచేసే కుట్ర జరుగుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగురి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ లక్షల కోట్ల సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే సవాళ్లను మరింత ధీటుగా ఎదుర్కోవడానికి శత వార్షికోత్సవాలు వేదిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు సీపీఐ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. సభకు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించగా, సమావేశంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకులు మేడా హనుమంతరావు, రావుల అంజిబాబు, వలీ, నాసర్‌జీ, అకిటీ అరుణ్‌కుమార్, సురేష్, చల్లా చిన ఆంజనేయులు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలకు చేరిన మందులు

- రూ.43 లక్షల అత్యవసర ఔషధాల పంపిణీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, డిసెం బరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశువైద్యశాలలకు రూ.43 లక్షల విలువ చేసే మందులను సరఫరా చేసినట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ నర సింహారావు తెలిపారు. 'పడకేసిన పశు వైద్యం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురి తమైన కథనానికి ఆయన స్పందిం చారు. జిల్లాలోని పశు వైద్యశాలల్లో అవసరమైన మందులను పంపిణీ చేశామని తెలిపారు. జిల్లా పశు వైద్యశాల (పాలీ క్లినిక్)తో పాటు, 9 తాలూకా స్థాయి పశు వైద్యశాలలు, 45 వెటర్నరీ డిస్పెన్సరీలు, 39 గ్రామీణ పశువైద్య శాలలకు ఈ మందులను పంపామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి పశువులకు అవసరమైన మందులను వినియోగిం చుకోవాలని సూచించారు

నిధులున్నా.. నిరుపయోగం

(5వ పేజీ తరువాయి)

యార్డులో నిర్మించారు. అయితే బీసీ కాలనీ కూడా యార్డుకు పక్కనే ఉంటుంది. అటు పూలే కాలనీ కూడా యార్డుకు దగ్గర్లో ఉంటుంది. విజయవాడ రోడ్డు, సుల్తానాబాద్ వంటి శివారుల్లో ఎక్కడా ఒక్క స్టేషన్ ఏర్పాటుకు కూడా మున్సిపాలిటీ ఆలోచనే చెయ్యలేదు. కేంద్రం నిధులిస్తోంది... నిర్మాణం చేపట్టమన్నారు కనుక ఎక్కడో ఒక చోట నిర్మించేస్తే పనయిపోతుందన్నట్టు పూర్తి నిర్లక్ష్యాన్ని తెనాలి మున్సిపల్ అధికారులు ప్రదర్శించారు. రూ.2.16 కోట్లతో చెత్త సమస్యకు చరమగీతం పాడే అవకాశం ఉన్నా, అధికారుల ముందుచూపులేమితో ఇక్కడి లక్ష్యాన్ని నీరుగార్చింది. పోనీ ఉపయోగమో.. నిరుపయోగమో వారు తల పెట్టిన చోటయినా నిర్మించారా అంటే అదీలేదు. కంపోస్ట్ యార్డులో ఒక గదికోసం శ్లాబ్ వేసి వదిలేశారు. మిగిలిన రెండు చోట్ల అయితే పునాదుల దశలోనే ఆగిపోయి నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాయి. అటు గుంటూరు నగరంలోనూ పలుచోట్ల నిర్మించేందుకు రూ.223 కోట్లు, మిగిలిన నరసరావుపేట, మంగళగిరి, తాడేపల్లి, బాపట్ల, పొన్నూరు, చీరాల, అద్దంకి, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, సత్తెనపల్లి వంటి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ వీటి నిర్మాణం కోసం మొత్తంమీద మరో రూ.30.6 కోట్లు కేటాయించారు. అయితే ఒకటి, రెండుచోట్ల మినహా మిగిలిన చోట్ల ఎక్కడా పనులు చివరి దశకు చేరలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసలు వీటిని పట్టించుకున్న నాథుడే లేడంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే అన్ని మున్సిపాలిటీల్లో కంపోస్ట్ యార్డులన్నీ చెత్తతో నిండిపోయాయి. కొన్నిచోట్లయితే చెత్త గుట్టలు కొండలను తలపిస్తున్నాయి.

బయో మైనింగ్ విధానంలో పరిష్కారం దిశగా

గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఇప్పుడు పట్టణాలకు శాపమయింది. పేరుకుపోయిన చెత్త గుట్టలను తొలగించటానికి, చెత్త సమస్యను అధిగమించటం కూటమి ప్రభుత్వానికి భారమే అవుతోంది. అప్పట్లో చెత్త నిధులను సద్వినియోగ పరుచుకుంటే, ఇప్పుడు అంత ఖర్చు చెయ్యాల్సిన అవసరం ఉండేది కాదు. 2025 అక్టోబరుకు చెత్త గుట్టలే ఉండకూడదని నిర్ణయించుకుంది. దీని కోసం బయో మైనింగ్ విధానం ప్రవేశపెట్టింది. దీనిద్వారా చెత్త గుట్టలను గ్రేడింగ్ చేసి, మట్టిని జల్లించి కంపోస్ట్ చేయదలిస్తే, ప్రమాదకర వ్యర్థాలను మాత్రం ఆధునిక విధానంలో నిర్వీర్యం చేస్తారు. దీనికోసం రాష్ట్రం మొత్తంమీద భారీ వ్యయమే అవుతోంది. ఒక్క తెనాలి మున్సిపాలిటీలోని చెత్తను బయో మైనింగ్ విధానంలో తొలగించటానికి రూ.3.17కోట్లు ఖర్చవుతుంది. దీని ప్రకారం చూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపాలిటీలన్నింటిలో రూ. 100 కోట్ల పైనే ఖర్చవుతుంది. గతంలో వచ్చిన నిధులను వినియోగించుకుంటే ఇప్పుడు ఇంత భారం పడేది కాదు. మొత్తం మీద గత ప్రభుత్వ నిర్వాకంతో పట్టణాల్లో పేరుకున్న చెత్తను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ఒక యజ్ఞాన్నే చేపట్టినట్టయింది.

వినూత్నంగా.. వరి

- తక్కువ పెట్టుబడి.. అధిక లాభాలు
- ఎకరాకు 48 నుంచి 50 బస్తాల దిగుబడి
- ఆదర్శంగా నిలుస్తోన్న రావిచెట్టుపాలెం రైతులు
- నిన్న ఆర్ఎన్ఆర్ 15048.. నేడు కేఎన్ఎం 733 సాగు


రైతులు పండిస్తున్న 733 కె.ఎన్.ఎం రకం వరి పంట

వినుకొండటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి సాగు అంటే నష్టం.. దిగుబడి కష్టం.. అని రైతులు భావిస్తున్నారు. అయితే వినూత్నంగా వరి సాగు చేస్తూ.. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మండలంలోని గోనుగుంట్లవారి పాలెం(రావిచెట్టుపాలెం) రైతులు. కొత్త కొత్త వంగడాలను సాగు చేస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు. ఏడేళ్లుగా నూతన వంగడాలను తెచ్చి సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. సమీపంలోని వాగు నీటి సాయంతో కొత్త రకం వరి వంగడాలను పరిచయం చేస్తూ ఎకరాకు 45 నుంచి 50 బస్తాలు వడ్ల దిగుబడి సాధిస్తున్నారు. వేసిన పంట వేయకురా ఆ పంటను పాడు చేయకురా అనే సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారు. రైతే రాజు అనే నానుడితో లాభాల బాటలో సేద్యం చేస్తున్నారు. 120 రోజుల వ్యవధి గల వరి వంగడాలను సాగు చేస్తున్నారు. తెలంగాణలోని జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అభివృద్ధి చేసిన 733 కేఎన్ఎం రకానికి చెందిన కోనారం అతి సన్నాలను గ్రామస్తులంతా ఈ సారి సాగు చేశారు. నెల్లూరులోని సింహపురి అగ్రో ఇన్ ఫుడ్స్ నుంచి 500 ఎకరాలకు బస్తా రూ.1150 చొప్పున 500 బస్తాల వంగడాలను తెప్పించి ఆగస్టు 20న నాట్లు వేశారు. ఏవిధమైన తెగుళ్లు సోకలేదు. ఆశించిన మేరకు దుబ్బు కట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వరి దండగని.. పెట్టుబడి కూడా రాదనే భావనలో మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు క్రాప్ హాలిడే ప్రకటించి పొలాలను బీళ్లు పెట్టారు. కానీ ఈ గ్రామానికి చెందిన రైతులు మొక్కవోని నమ్మకంతో వరి సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందుతున్నారు. గతంలో నంద్యాల నుంచి ఆర్ఎన్ఆర్ 15048 రకానికి చెందిన వంగడాలను దిగుమతి చేసుకున్నారు. రైతులంతా ఐక్యంగా సుమారు 500 ఎకరాల మేరకు పంటలు పండించారు. ఎవరూ ఊహించని విధంగా ఎకరానికి 48 నుంచి 50 బస్తాల వరకు దిగుబడి సాధించారు. షుగర్ లెస్ (తెలంగాణ సోనా) పేరుతో బస్తా ఒకటికి రూ.2200 డిమాండ్‌గా విక్రయించి లాభాలు సాధించారు.

పెట్టుబడులకు ఇబ్బందులు



మా గ్రామంలో నూతన వరివంగడాలు పండిస్తున్నాం. నేను ఈ ఏడాది 15 ఎకరాలు సాగు చేస్తున్నాను. సాగుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉంటే లాభం. వడ్డీకి తెచ్చి పంటలు పండిస్తే పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం నిబంధనలు లేకుండా బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుంది.

\- మల్లాది పుల్లారావు

దళారి వ్యవస్థతో నష్టం



రైతు ఇంటికి వచ్చి పంటలను కొనుగోలు చెయ్యాలి. ప్రధానంగా దళారి వ్యవస్థతో రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారు. ఎగుమతి, దిగుమతి కూలీలు భరించలేక పోతున్నారు. ప్రభుత్వం ఎప్పుడైతే నేరుగా రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తుందో అప్పుడే రైతులకు సాగుపై ఆదాయం వస్తుంది.

\- నాగెండ్ల హనుమంతరావు

గోశాలల నిర్మాణంలో అలసత్వం

- పీఆర్ జాయింట్ కమిషనర్ సునీత

గుంటూరు సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో ప్రారంభించిన గోశాలల నిర్మాణంలో అలసత్వం వహిస్తున్నారని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ జాయింట్ కమిషనర్ సునీత అన్నారు. గురువారం గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారులు అలసత్వం వీడి యుద్ధ ప్రాతిపదికన పల్లె పండుగ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జనవరి 10కి పల్లెపండుగ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ శంకర్, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఏపీడీ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 31నే పింఛన్ల పంపిణీ

గుంటూరు సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు జనవరి నెలకు సంబంధించిన పింఛన్ ఒకరోజు ముందే అంటే ఈ నెల 31 అందనున్నది. జనవరి 1న ఇవ్వాల్సిన పెన్షన్‌ను ముందే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. ఎంపీడీవోలు ఈ నెల 30న పెన్షన్ సొమ్మును బ్యాంకు నుంచి డ్రా చేసి సచివాలయ సిబ్బందికి అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నెల 31నే పెన్షన్ పంపిణీని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి ధ్రువీకరించారు.

రేపు చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

- యేల్చూరి, బాలకృష్ణ పోటాపోటీ ప్రచారం

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు శనివారం జరగనున్న నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది. చాంబర్ అధ్యక్ష బరిలో నిలిచిన మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు, చాంబర్ మాజీ కార్యదర్శి రంగా బాలకృష్ణ ఇద్దరూ పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అభ్యర్థులిద్దరూ ఇప్పటికే పలువురు వ్యాపారులు, సన్నిహితులతో ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. గురువారం యేల్చూరి వెంకటేశ్వర్లు తన ప్యానల్ సభ్యులతో కలిసి గుంటూరు నగర పరిధిలోని లాలాపేట ఏలూరుబజారు, పట్నంబజారు, బండ్లబజారు, వాసవీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. వ్యాపారులను కలిసి తమ ప్యానల్ సభ్యులకు ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. వ్యాపారులకు అన్ని వేళలా అండగా నిలుస్తానని యేల్చూరి వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వెచ్చా కృష్ణమూర్తి, టీఎల్‌వీ వీరాంజనేయులు, నాగేశ్వరరావు, రామిరెడ్డి, సదా శివయ్య తదితరులున్నారు. ఇక అధ్యక్ష బరిలో నిలిచిన రంగా బాలకృష్ణ తన ప్యానెల్ సభ్యులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు వ్యాపారులను కలిసిన ఆయన గురువారం ఏలూరుబజారు, బండ్లబజారు, కొత్తపేట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించటలంతో పాటు అన్ని వేళలా అండగా నిలుస్తానని బాలకృష్ణ కోరారు. 28న ఎన్నికల్లో ఓటు వేసి తన ప్యానల్‌ను గెలిపించాలని కోరారు.


ఎన్నికల ప్రచారంలో యేల్చూరి వెంకటేశ్వర్లు, ప్యానల్ సభ్యులు


ఎన్నికల ప్రచారంలో రంగా బాలకృష్ణ ప్యానల్ సభ్యులు

కాల్వలపై.. కూటమి నేతల కన్ను

(5వ పేజీ తరువాయి)

వ్యయం అంచనా రూ.3.34కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనులు, వ్యయం అంచనా రూ. 3.65 కోట్లు. ఓఅండ్ఎం సిఫ్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనులు, వ్యయం అంచనా రూ. 1.78 కోట్లు. ఈ పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లుచేస్తోంది. పనుల నిర్వహణకు టెండర్లను జలవనరుల శాఖ అధికారులు నిర్వహిచారు.

మూడు డివిజన్‌లలో టెండర్లు రద్దు

సత్తెనపల్లి, నరసరావుపేట లింగంగుంట్ల ఓఅండ్ఎం, వినుకొండ సిఫ్ట్ డివిజన్‌ల పరిధిలోని కాలువల మరమ్మతు పనులకు సంబంధించిన టెండర్లు రద్దు చేశారు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్‌లో రూ. 4.69 కోట్ల వ్యయంతో 101 పనులు, లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో రూ.3.65కోట్ల వ్యయంతో 31 పనులకు సంబంధించిన టెండర్లు నిర్వహించారు. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు కూడా పూర్తి చేశారు. పనులు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి డివిజన్‌లో రూ. 3.34 కోట్ల వ్యయంతో 62 పనులు.. వినుకొండ పరిధిలో రూ. 1.78 కోట్ల వ్యయంతో 34 పనులు, లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో రూ. 4.21 కోట్ల వ్యయంతో 76 పనులు చేపట్టేందుకు అయా డివిజన్‌ల వారీగా టెండర్లు నిర్వహించారు. టెండర్ల ప్రక్రియ కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ సమయంతో నిలిచిపోయింది. ఈ మూడు డివిజన్‌లలో రూ. 9.33 కోట్ల విలువైన 141 పనులు నిలిచిపోయాయి. సత్తెనపల్లి డివిజన్‌లో 62 పనులకు గాను 52 పనులకు టెండర్లు నిర్వహించగా ఐదు పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్‌లు పూర్తయ్యాయి. ఈ ఐదు పనులు చేపడుతున్నారు. ఈ డివిజన్‌లో ఇంకా 57 పనులు టెండర్లు నిర్వహించాల్సి ఉంది.

టెండర్లు నిర్వహిస్తాం

కాలువల మరమ్మతు పనులు టెండర్లు రద్దు చేయడంపై సత్తెనపల్లి డివిజన్ ఈఈ మురళీధర్, వినుకొండ ఈఈ ప్రేమ్‌కుమార్, ఓఅండ్ఎం లింగంగుంట్ల ఈఈ డీవీ సుబ్బారావును వివరణ కోరగా టెండర్లు రద్దు చేశామన్నారు. పనులు చేపట్టేందుకు మళ్లీ టెండర్లు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం

మంగళగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సెల్: 7093912653, 08645-295192 నెంబర్లకు ఫోను చేసి చెబితే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైష్ణవ మహాదివ్య క్షేత్రంపై హైకోర్టులో వ్యాజ్యం దాఖలు

తాడేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాకలోని శ్రీవైష్ణవ మహా దివ్యక్షేత్రంపై హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ బిల్డింగ్ రూల్స్ 26 ప్రకారం కలెక్టర్ అనుమతి లేకుండా మత కట్టడాలు నిర్మించడం చట్టవిరుద్ధమని, పంచాయతీరాజ్ చట్టంలో రూల్ 14 ప్రకారం ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ రోడ్డును ఆక్రమించి మత సంబంధ కట్టడాలు నిర్మించడం చట్ట విరుద్ధమని మున్సిపల్, రెవెన్యూ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించడం చట్ట విరుద్ధమని హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ న్యాయవాది వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం తక్షణమే వైష్ణవ మహాదివ్య క్షేత్ర యాజమాన్యానికి, ప్రిన్సిపల్ సెక్రటరీ, మున్సిపల్, రెవెన్యూ, కలెక్టర్‌లకు నోటీసులు జారీ చేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు. ఈ విషయమై వైష్ణవ మహాదివ్య క్షేత్రం ప్రతినిధి చలువాది మల్లికార్జునరావును వివరణ కోరగా తమకింత వరకు ఎటువంటి నోటీసులు అందలేదని, తామెవరిని ఇబ్బంది పెట్టలేదని చట్టాన్ని ఉల్లంఘించలేదని నోటీసులు అందాక తమ న్యాయవాది ద్వారా ప్రతిస్పందిస్తామని తెలిపారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

దుగ్గిరాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో చేసే ధ్యానం జీవితంలో భాగమైతే వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతారని రామచంద్ర మిషన్ జోనల్ కో-ఆర్డినేటర్ సుంకర కోటేశ్వరరావు అన్నారు. దుగ్గిరాలలోని శ్రీసద్గురు శుభవేదికలో గురువారం సాయంత్రం 4గంటల నుంచి గంటన్నర పాటు ధ్యాన శిక్షణ కొనసాగించారు. సుంకర మాట్లాడుతూ ఉదయం, సంధ్యాసమయంలో ధ్యానం చేయడం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ధ్యానం చేసేది కొద్ది నిమిషాలే ఐనప్పటికీ రోజంతా ఉత్సాహంగా దైనందిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహద పడుతుందన్నారు. ధ్యానంలో భాగస్వాములయ్యేందుకు ప్రతిఒక్కరూ ఆసక్తి చూపుతున్నారని, తొలిరోజు శిక్షణకు 200 మందికి పైగా హాజరైనట్లు కోటేశ్వరరావు తెలిపారు.

707 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 26: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 707 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కాయ, కొమ్ములు ఒకే ధరలు పలుకగా క్వింటాల్‌కు కనిష్టధర రూ.11,200, గరిష్టధర రూ.11,300, మోడల్ ధర రూ.11,200 పలికాయి.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మేడికొండూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాదాల గోవర్ధన్‌రావు చారిటబుల్ ట్రస్ట్, ఇంటెల్ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరంను మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాములపాటి శివన్నారాయణ, గ్రామ సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్ తదితరులు ప్రారంభించారు. 250 మంది రోగులు శిబిరంలో అవకాశాన్ని సద్వినియోగించుకున్నారు. ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఐ.మారుతీప్రసాద్, డాక్టర్ జి.దీప్తి, డాక్టర్ సాయితేజ, డాక్టర్ గాయత్రి, ల్యాబ్ టెక్నీషియన్స్ జీ నాగేంద్రబాబు, అశ్విన్ తదితరులు వైద్య శిబిరంలో రోగులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. శుక్రవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకోవలసిందిగా ఇంటెల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ తెలియజేశారు.

కోస్టల్ బ్యాంకు ఆధ్వర్యంలో..

తాడేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలోని కోస్టల్ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఖాతాదారులకు, స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తామని బ్యాంకు మేనేజర్ వరకుమారరావు తెలిపారు. ఇటువంటి వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శ్రీనాథ్ ఎస్కే. సులేమాన్, పీవీఎల్ సరోజ, నాగార్జున, లక్ష్మీ ఫౌండేషన్ డాక్టర్స్ భవాని, నజియా పాల్గొన్నారు.

నేడు ఆటల పోటీలు

పెదనందిపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10గంటలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దొప్పలపూడి రమేష్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

29న మెగా వైద్య శిబిరం

మంగళగిరి సిటీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అంజుమన్-ఈ-హిమాయతుల్ ఇస్లాం సంస్థ సహకారంతో మానవ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మంగళగిరి ఈద్గా కమ్యూనిటీ హాల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ తెలిపారు. షుగర్, గుండె, మానసిక, కీళ్ల, ఎముకలు, గైనకాలజీ, చర్మ, మూత్రపిండాలు, కేన్సర్, ఈఎన్‌టీ, దంత, కంటి, జనరల్ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి టూడీ ఎకో, ఈసీజీ, ఫిజియోథెరపీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్, కేన్సర్ నిర్ధారణా పరీక్షలు చేస్తామని చెప్పారు. ఈ వైద్యశిబిరాన్ని మంగళగిరి, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరుస అల్పపీడనాలతో అన్నదాతల్లో ఆందోళన

- వర్షం తక్కువ.. నష్టం ఎక్కువ
- దెబ్బతీస్తున్న మంగు పరిస్థితులు
- తెగుళ్ళు, చీడలతో తగ్గుతున్న దిగుబడులు



మిర్చిపైరులో తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు



మొలకెత్తిన శెనగ పైరు

పెదనందిపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరుస అల్పపీడనాలు రైతులను వణికిస్తున్నాయి. వర్షం తక్కువగా ఉన్నా వాతావరణ పరిస్థితులు మాత్రం బెంబేలెత్తిస్తున్నాయి. 15రోజులకు పైగా ఎండ రాక పైర్లు దెబ్బతింటాయని రైతులు భయపడిపోతున్నారు. ఇప్పటికే పైర్లపై తెగుళ్లు, పురుగుల దాడి తీవ్రంగా ఉంది. మిర్చి, పొగాకు, శెనగ, మొక్కజొన్న, మినుము తదితర పంటలపై చీడపీడల ఉధృతి పెరిగింది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గేలా ఉన్నాయి. ముందుగా ఖరీఫ్‌లో వేసిన పత్తి, మిర్చి తదితర పైర్లు ప్రస్తుతం కాయ, కోత దశలో ఉండగా, రబీలో కీలకమైన పంటలు అపరాలు మొక్కజొన్న, శెనగ, మినుము వంటి తదితర పంటలు సాగు పూర్తయ్యి ఎదుగుదల దశలో ఉన్నాయి. సాధారణంగా నవంబరుతో వర్షాకాలం ముగుస్తుంది. డిసెంబరులో అడపాదడపా జల్లులు తప్ప వర్షాలు అంతగా ఉండవు. పగటిపూట ఒక మోస్తరు ఎండలు, రాత్రిపూట చలితో పాటు తెల్లవారుజామున మంచు కురుస్తుంది. ఈ తరహా వాతావరణం అన్ని రకాల పంటలకు ఉపయోగం. అయితే ఈ ఏడాది అందుకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈనెలలో బంగాళాఖాతంలో నాలుగైదు అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడటంతో వాటి ప్రభావంతో మండలంలో వాతావరణ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సాగు చర్యలకు ఆటంకంగా మారింది. వాయుగుండాల వల్ల వర్షం అంతగా లేకపోయినప్పటికీ వాటి ప్రభావంతో మండలంలో పగటి పూట వాతావరణం చల్లగా ఉంటోంది. నిత్యం మబ్బులు కమ్మి ఉంటున్నాయి. ఇక రాత్రి పగలు తేడా లేకుండా తుఫాన్ తరహా గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావం పంటలపై ఎక్కువగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటలపై తెగుళ్లు, పురుగుల దాడి

విభిన్న వాతావరణంతో పంటలపై తెగుళ్ళు, పురుగుల దాడి తీవ్రమైంది. మిర్చి పైర్లు కాయ, కోత దశలో ఉండగా మొక్కలపై కుచ్చు, బొబ్బర, ఎండుకొమ్మ తెగుళ్లు అధికంగా సోకాయి. మందులు పిచికారీ చేసినా నివారణ సాధ్యపడట్లేదని, దీంతో పంట దిగుబడి సగానికి సగం తగ్గిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

- వంగవీటి రాధాకృష్ణ
- పలు చోట్ల రంగా విగ్రహాలకు నివాళులు

మంగళగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రంగా ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వంగవీటి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకుని వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆయనకు నివాళి అర్పించారు. ఆత్మకూరు గ్రామంలో రంగా విగ్రహాన్ని ఆయన కుమారుడు వంగవీటి రాధాకృష్ణ ఆవిష్కరించారు. మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద రెండో వార్డు మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర బాబీ ఆధ్వర్యంలో రాధాకృష్ణ రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ రంగా కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన నేత మాత్రమే కాదని, బడుగు బలహీన వర్గాల వెన్నంటి వారికి అండగా నిలిచారని పేర్కొన్నారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు రంగా విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో కాపు ప్రతినిధులు గోవాడ దుర్గారావు, రంగిశెట్టి పెద్దబ్బాయ్, పల్నాటి నాగేశ్వరరావు, తెలగనేని విక్కీ, వల్లా శంకర్ బాబు, రంగిశెట్టి శ్రావణ్, బత్తుల గణపతినాయుడు, కాపు సంఘం జాతీయ అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణ, తోట సాంబశివరావు, మల్లాది జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రామనాథం పూర్ణచంద్రరావు, జాన్‌బాబు, సామియేలు తదితరులు రంగా విగ్రహానికి నివాళులు అర్పించారు.



మంగళగిరిలో రంగా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రాధాకృష్ణ

రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో..

తాడేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మణిపాల్ ఆస్పత్రి వద్ద మహానాడు సుందరయ్య, రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగా కుమారుడు వంగ వీటి రాధా ముఖ్యఅతిథిగా పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగా అభిమానులు వివిధ పార్టీల నేతలు జంగాల సాంబశివరావు, పుల్లెపు భాస్కరరావు, తిరుమలశెట్టి సురేంద్ర, జంగాల వెంకటేష్, స్థానిక రాధారంగా మిత్రమండలి సభ్యులు పాల్గొని 1000 మందికి అన్నదానం నిర్వహించారు.

ఉండవల్లి సెంటర్లో..

తాడేపల్లి మండలం ఉండవల్లి సెంటర్లో రాధారంగా మిత్రమండలి, కూటమి నేతల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ వంగవీటి రంగా ఆశయాలతో ముందుకు సాగుతామని ఉండవల్లి సెంటర్లో వంగవీటి రంగా స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాధారంగా మిత్ర మండలి, కూటమి నేతలు, కార్యకర్తలు గాదె పోతురాజు, ఉప్పు హరిబాబు, ఏకూరి ఆదెయ్య, జంగాల వెంకటేష్, జొన్నా రాజేష్, గాదె వినయ్, రాజా రమేష్, సింగంశెట్టి మల్లి, తోట సాంబశివరావు, దొప్పలపూడి జ్యోతిబసు, కిషోర్, ఠాగూర్, చాముండేశ్వరి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

తాడికొండ శివారు బడేపురంలో..

తాడికొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా పేదల కోసం పోరాడిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని టీడీపీ, జనసేన నాయ కులు తెలిపారు. గురువారం రంగా వర్ధంతి సందర్భం గా టీడీపీ, జనసేన పార్టీ నాయకులు తాడికొండ శివారు బడేపురం గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నీతికి, నిజాయితీకి మరో పేరుగా ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న నాయకుడు వంగవీటి రంగా అన్నారు. కార్యక్రమంలో రంగా అభిమానులు, టీడీపీ వాణిజ్య విభాగం జనరల్ సెక్ర టరి బండ్ల కోటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు తాయి కాంతి కిరణ్, కాలిశెట్టి రాజీవ్, మొగిలి అశోక్, భాస్కర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈమని, పెదకొండూరు, చింతలపూడి గ్రామాల్లో విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈమని సెంటర్లోగల రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిం చిన వారిలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కుప్పాల శ్రీరామ్మూర్తి, జనసేనకు చెందిన తుమ్మ పూడి చంటి, స్థానిక నాయకులు యడ్ల సాయి కృష్ణ, గమిడి సాంబయ్య, బొందలపాటి పూర్ణ, అనిల్ తదతరులు పాల్గొన్నారు.

● **వట్టిచెరుకూరు:** పేదల కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుడని ముట్లూరు జనసేన, టీడీపీ, కాపు యువత కొనియాడారు. ముట్లూరు గ్రామపంచాయతీ సమీపంలోని రంగా విగ్రహానికి జనసేన, టీడీపీ, కాపు యువత పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లం చిన్న, బీ శ్రీనివాసరావు, ఏ పిచ్చయ్య, వీరిశెట్టి సాంబయ్య, సుబ్బారావు, టీ పాపయ్య, ఇనుముల రాంబాబు, పత్తి తంబి, అల్లం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిరంకుశ విధానాలపై రాజీలేని పోరాటం

- సీపీఐ రాష్ట్ర నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు



సీపీఐ శత వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాలక ప్రభుత్వాల నిరంకుశ విధానాలపై సీపీఐ వందేళ్లుగా రాజీలేని పోరాటాలు చేస్తూనే ఉందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి సీపీఐ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణభవన్ వద్ద గురువారం సాయంత్రం సీపీఐ శత వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం కార్మికవర్గ సైద్ధాంతిక శక్తిగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు అణగారిన వర్గాల పక్షాన అనేక పోరాటాలు సాగిస్తూనే ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ మారణ హోమం సృష్టిస్తుందని ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసిందని, అందుకే ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి 11 సీట్లు మాత్రమే ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, అదానీతో గతంలో జరిగిన ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని, ప్రజాసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తొలుత సీపీఐ పతాకాన్ని ముప్పాళ్ల ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, ప్రజానాట్య మండలి జాతీయ కార్యదర్శి గని, జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, సీపీఐ నేతలు అన్నవరపు ప్రభాకర్‌రావు, కంచర్ల కాశయ్య, దేవరకొండ శ్రీనివాస రావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి టౌన్** : తాడేపల్లిలోని పార్టీ కార్యాలయం ఎదుట జెండాను సీపీఐ సీనియర్ నేతలు మానికొండ డాంగే, కంచర్ల కాశయ్య, గుంటక సాంబిరెడ్డి ఆవిష్కరించారు. గేటు సెంటర్, నెహ్రూ బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో పార్టీ పతకాలను నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంచర్ల కాశయ్య మాట్లాడుతూ పేదల కోసం పోరాటం చేసిన ఘనత సీపీఐకి ఉందని ఈ వంద సంవత్సరాల ప్రయాణంలో అనేకమంది అమరులయ్యారని చెప్పారు. మృతవీరులకు జోహార్లన్నారు. కార్యక్రమంలో నేతలు కంచర్ల కాశయ్య, తుడిమిల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, మునగాల రామారావు, శివ, శ్యాం, బాషా, ఖాసిం, శ్రీహరి ప్రసాద్, హనోక్ తదితరులు పాల్గొన్నారు.

● **తుళ్లూరు** : రాజధాని గ్రామాలైన రాయపూడి, మోదుగులంకపాలెం, వెంకటపాలెం తదితర గ్రామాల్లో సీపీఐ శత వార్షికోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా గౌరవ అధ్యక్షుడు పచ్చల సాంబశివరావు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంలో సీపీఐ ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముప్పాళ్ల శివశంకరరావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, కంభంపాటి దేవనిదయ, షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

● తాడికొండ మండలంలోని కంతేరులో ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారం లేకపోయినా కార్మికులు, కర్షకుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిందన్నారు. మతతత్వానికి వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ, దేశ సమైక్యత కోసం నిబద్ధతతో పోరాటాలు చేసిన ఘనత సీపీఐదే అన్నారు.

అభ్యుదయ కవి మధుకు అరుదైన అవకాశం

మంగళగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి సాహితీ కళావేదిక కోకన్వీనర్, అభ్యుదయ కవి గోలి మధుకు అరుదైన అవకాశం లభించింది. విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో జరుగనున్న ప్రపంచ 6వ తెలుగు రచయితల మహాసభ వేదికపై ప్రసంగించే అవకాశం దక్కింది. ఈ మేరకు సాహితీ కళా వేదిక ప్రతినిధులు గురువారం మధుకు అభినందనలు తెలియజేశారు. ఆయనకు దక్కిన అవకాశం మంగళగిరి సాహితీ కళావేదికకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, మానవ వికాస మండలి కన్వీనర్ రేకా కృష్ణార్జునరావు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లూ బత్తుని లక్ష్మణరావు, చైతన్య వీవర్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

- ఏవో కిరణ్మయి

కాకుమాను, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసే ప్రతి పంట వివరాలను ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి తెలిపారు. కొండబాలవారిపాలెంలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. గ్రామంలో రైతు సేవాకేంద్రాల ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రబీలో పంట నమోదు చేయించుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పంటల బీమా పథకం కూడా ఈ నెల చివర వరకు గడువు ఉందని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ మేఘన సంధ్య, ఎంపీఈవో శివప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి : కొల్లా వీరయ్య

కాకుమాను, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అభిప్రాయపడ్డారు. గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని, విద్యుత్ చార్జీలు తగ్గింపు అమలు చేయనందుకు వైసీపీ ఆందోళనలు నిర్వహించాలని ఆ పార్టీ అధినేత జగన్ ఆదేశించడం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ పాలనలో ఆర్థిక రంగం కుదేలైందని ఆర్థిక నిపుణులు, సాధారణ ప్రజలు, వైసీపీ కార్యకర్తలు కూడా గ్రహించారని ఆయన తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు



బండారుపల్లి గ్రామ రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

తాడికొండ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు చేపట్టిందని తహసీల్దార్ కే నాసరయ్య తెలిపారు. గురువారం బండారుపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల నుంచి 26 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఎంజోమెంట్, సర్వే సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. జనవరి 8 నుంచి 45 రోజు ల్లోపు అర్జీలు పరిష్క స్తామని అన్నారు. గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నూతలపాటి హనుమంతరావు, వీఆర్వో, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పెదకొండూరులో శ్రీకనకపుట్టలమ్మ ఇరుముడుల సమర్పణ

దుగ్గిరాల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు శ్రీకనక పుట్టలమ్మ మాలధరించిన దీక్షాపరులు ఇరుముడులను గురువారం సమర్పించారు. అమ్మవారి హోమం నిర్వహించి, పూర్ణాహుతి కార్యక్రమ అనంతరం భక్తులకు అన్నసమర్పణ చేపట్టారు. 40 రోజులుగా అమ్మవారి మాలధరించి దీక్షా వస్త్రాలు ధరించి భక్తితో అమ్మవారిని కొలిచిన భక్తులు గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఇరుముడులు సమర్పించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

సమాజాభివృద్ధిలో వైద్యుల పాత్ర కీలకం

- ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ



వైద్య విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేస్తున్న ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ

మంగళగిరి సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని ఈగల్ చీఫ్, ఐజీ ఆకే రవి కృష్ణ అన్నారు. మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సులో నూతనంగా చేరిన వైద్య విద్యార్థులకు స్వాగతం పలుకుతూ గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి కష్టాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ వైద్యులుగా ఎదగాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారని, ఇది దేశ భవిష్యత్తుకు ఎంతో ప్రమాదకరమని పేర్కొన్నారు. ఏపీలో గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను తీసుకువచ్చిందని, రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎక్కడైనా డ్రగ్స్ వాడుతున్నట్టు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 1972కు ఫోను చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చౌదరి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణీంద్ర, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ పనులను పరిశీలించిన అధికారులు



పెనుమూలిలో రోడ్ల నాణ్యతను పరిశీస్తున్న ఎస్ఈ జీ బ్రహ్మయ్య, డీఈ గుప్తా తదితరులు

దుగ్గిరాల, డిసెంబరు 26: మండలంలోని పలుగ్రామాల్లో ఇటీవల ప్రారంభించిన పల్లె పండుగ పనులను పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు గురువారం పరిశీలించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పనులు పూర్తి చేయడంతో పాటు, మిగిలిన వాటిని కూడా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అన్నారు. మండల వ్యాప్తంగా రూ.3.40కోట్లతో జరుగుతున్న పనులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పెనుమూలి, కేఆర్‌కొండూరు, రేవేంద్రపాడు, పెదకొండూరు, గొడవర్రు, చిలువూరు, పేరుకలపూడిలో నిర్మాణంలో ఉన్న రోడ్లను పరిశీలించిన వారిలో డీఈ గుప్తా, ఏఈ గోవర్ధనరావు, ఆయా గ్రామాల సర్పంచులు ఉన్నారు.

విద్యార్థులు ఎంచుకున్న మార్గాన్ని ప్రోత్సహించాలి

- జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి



మలినేనిలో ఫార్మసీ తరగతుల ప్రారంభానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సుందరాచారి

వట్టిచెరుకూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎంచుకున్న మార్గాన్ని ప్రోత్సహించాలే గాని వారిపై ఒత్తిడి చేయటం ద్వారా అనేక అనర్థాలకు దారి తీస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులకు గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి హితవు పలికారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభ కార్యక్రమానికి డాక్టర్ సుందరాచారి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడితే తమ లక్ష్యాన్ని సులభతరంగా చేరుకోవచ్చన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు, వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ డీ శ్రీనివాసకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సుధాకరరావు, ఫార్మసీ విభాగాధిపతి జీ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ

మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో నూతన అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి గురువారం కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు దంపతులు భూమిపూజ నిర్వహించారు. వీరితో పాటు కుటుంబసభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, అకడమిక్ డీన్ పోపూరి రమేష్‌బాబు, వివిధ విభాగాల డీన్‌లు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ

మంగళగిరి సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రోటరీ క్లబ్, రోటరీ క్లబ్ ఆఫ్ జుబ్లీహిల్స్, బీజీఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో పదిమంది మహిళలకు గురువారం మంగళగిరి ఎంఎంకే స్టేడియం ఆవరణలో ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హ్యారీ రగుల్స్-మెంబర్‌షిప్ అట్రాక్షన్ జోనల్ చైర్ ఏజెడ్-1 కందిమళ్ల స్వప్న మాట్లాడుతూ మంగళగిరి రోటరీ క్లబ్ ఎన్నో స్ఫూర్తిదాయక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని అభినందించారు. మంగళకరం ప్రాజెక్టు కింద జర్మనీ టెక్నాలజీతో కృత్రిమ చేతులు పంపిణీ చేసి, సుమారు రూ.కోటికి పైగా ఖర్చు చేసి ఈ ప్రాజెక్టును ఎంతో సమర్థవంతంగా నిర్వహించారని కితాబిచ్చారు. శక్తి ప్రాజెక్టు కింద విద్యార్థినులకు సర్వైకల్ కేన్సర్ వ్యాక్సినేషన్, బస్టాండులో పసిపిల్లలకు తల్లులు పాలిచ్చేందుకు వీలుగా ఫీడింగ్ రూం ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్ష, కార్యదర్శులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీ మోహన్‌రావు, ప్రతినిధులు ఇసునూరు అనిల్ చక్రవర్తి, వడ్లమూడి శ్రీనివాసరావు, కాపరౌతు సుందరయ్య, నూతలపాటి వెంకటేశ్వరరావు, పారేపల్లి నిరంజన్ గుప్తా, రావెల శ్రీనివాసరావు, జొన్నాదుల బిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టు సభ్యుడిగా నమశ్శివాయ

మంగళగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న శ్రీశ్రీనివాస ఉమారామలింగేశ్వర దేవాంగ నిత్యాన్నదాన సత్రం వ్యవస్థాపక సభ్యుడిగా మంగళగిరికి చెందిన అల్లక నమశ్శివాయ నియమితులయ్యారు. ఈ మేరకు అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బల్లా వెంకటరమణ, అల్లక తాతారావు, ప్రతినిధులు మొటికి వెంకట సత్యనారాయణ, కొసనం కోటనాగశ్యామలరావు, బొమ్మన శ్యామ్‌కుమార్, కొండక వెంకటేశ్వరరావు, కటకం సత్యనారాయణ, బొమ్మన రవికుమార్, మాన్యం రాము తదితరులు నమశ్శివాయను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

మహిళలను లక్షాధికారులుగా మార్చడమే లక్ష్యం

- డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

ప్రత్తిపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలను లక్షాధికారులుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన బ్యాంకర్ల సమావేశంలో పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ స్వయం సిద్ధ ప్రాజెక్టు కింద ఆసక్తి ఉన్న మహిళలకు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు లోన్ల మంజూరు విషయమై చర్చించారు. బ్యాంకర్ల వారీగా ఏపీ బ్యాంకుకు ఎన్ని అప్లికేషన్లు వచ్చాయి, ఎన్ని శాంక్షన్ చేశారు వంటి విషయాలను బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరికి సాధ్యమైనన్ని లోన్లు మంజూరు చేయాలన్నారు. జిల్లాల్లో వ్యవసాయ ఆధారిత డ్రోన్లకు ఎనభైశాతం సబ్సిడీపై ఎనిమిది మందికి అవకాశం ఉందన్నారు. డ్రోన్ పైలెట్‌లను ప్రోత్సహించే చేసే విధంగా లోన్లు ఇవ్వాలన్నారు. అంతేగాకుండా ప్రతి గ్రామంలో ఈజీ మార్టుల ఏర్పాటుకు అవకాశం ఉందని, ఆశావహులైన మహిళలకు 20 వేల వరకు క్రెడిట్‌తో సరుకులు ఇస్తామన్నారు. సమావేశంలో బ్యాంకర్లు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పరస్పర దాడులపై కేసు

తెనాలి (మారీసుపేట), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇండోర్ స్టేడియం వద్ద బుధవారం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణపై కేసులు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక సుల్తానాబాద్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, యశ్వంత్ వర్ధన్‌తో కలసి ఓ బాలుడు స్టేడియం వద్దకు రాగా వారి మధ్య చోటుచేసుకున్న వివాదం పెద్దదై దాడికి దారితీసింది. దాడిలో గాయపడిన ఇద్దరూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

విదేశాలకు పంపుతామంటూ మోసం

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు పంపుతానని మోసం చేసిన ఇద్దరిపై విద్యార్థి ఫిర్యాదు చేయడంతో గురువారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కొలనుకొండకు చెందిన తిరుమల ఆరోషిత్ సోదరిని చెరుకుపల్లికి చెందిన వారితో వివాహం చేశారు. సోదరి ఇంటికి వచ్చేపోయే క్రమంలో రమేష్ రెడ్డి, రవిచంద్ర ఇద్దరితో పరిచయం అయ్యింది. ఉన్నత చదువుల కోసం యూకే పంపిస్తామని చెప్పడంతో రూ.6లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.1లక్షలు అడ్వాన్స్ చెల్లించారు. విదేశాలకు పంపేందుకు ఎలాంటి పత్రాలు పూర్తి చేయకుండా ఇంకా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడికి గురిచేయడంతో రమేష్‌రెడ్డి, రవిచంద్రలు తనను మోసం చేస్తున్నారని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి: అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మెరుగు పర్చాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటరీ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ మార్కెట్ ఏరియాలో జరుగుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లోని వ్యర్థాలను గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి: టీపీవో సాంబశివరావు

తెనాలి(మారీసుపేట), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో భవన నిర్మాణాలకు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతులు తీసుకోవాలని టీపీవో సాంబశివరావు తెలిపారు. గురువారం బోసురోడ్డులో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం పనులను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. అనుమతులకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తే కూల్చివేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

అన్న క్యాంటీన్‌కు సిమెంట్ బెంచీలు

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థ మానవత ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ వద్ద సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. బస్‌స్టేషన్ సమీపంలోని క్యాంటీన్ వద్ద వృద్ధులు, వికలాంగులు కూర్చుని భోజనం చేసేందుకు గురువారం సిమెంట్ బెంచీలు బహూకరించారు. ఛైర్మన్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ, సమాజం అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా తమ సంస్థ సేవా కార్యక్రమాలు అందిస్తుందన్నారు.

తిరుమలకు తెనాలి సంకీర్తన బృందాలు

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కీర్తనలు ఆలపించేందుకు తెనాలి నుంచి 108 మంది గురువారం తరలివెళ్లారు. శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం, సాయిరామ్ సంగీత కళాశాల ఆధ్వర్యంలో 108 మంది బాల బాలికలు, మరికొంత మంది గాయకులు తిరుమలకు వెళ్లారు. తిరుమల ఆస్థాన మండపంలో శుక్రవారం అన్నమయ్య కీర్తనలు ఆలపించనున్నట్లు నిర్వాహకులు కొండపి శ్రీనివాసరావు, లక్ష్మీసునీత తెలిపారు.

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలను 23వ వార్డులో గురువారం పంపిణీ చేశారు.

కొత్తబొమ్మువానిపాలెంలో వైద్య పరీక్షలు

కొల్లిపర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న మెడికల్ క్యాంపులను పేదప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి అనురుధ్ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర శివారు కొత్తబొమ్మువానిపాలెంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సుస్మిత, ఏఎన్ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, డీఈవో బి. కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు రుణపరిమితి పెంపు: అర్బన్ బ్యాంకు చైర్మన్ హరిప్రసాదరావు

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలకు అర్బన్ బ్యాంకు రుణ పరిమితిని రూ.15 లక్షల నుంచి రూ.22 లక్షలకు పెంచామని ఆ బ్యాంకు చైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు చెప్పారు. మారీసుపేట శివాలయం కళ్యాణ మండపంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే వ్యక్తిగత రుణాలు కూడా రూ.2లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచామన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు కోటాపై హర్షం

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం కోటా కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల స్థానిక సంస్థల్లో బీసీలకు 24 శాతం మాత్రమే రిజర్వేషన్ దక్కిందని, ఇందులో న్యాయ పరమైన చిక్కులను తొలగించి యధాతథంగా రిజర్వేషన్లు అమలు చేస్తామని సీఎం చెప్పడం బీసీలకు పెద్దపీట వేయడమేనన్నారు.

ఇళ్ల మధ్య వ్యర్థాల డంపింగ్

● ఇక్కట్లు పడుతున్న బీసీ కాలనీ వాసులు


రోడ్డుపైనే పోసిన వ్యర్థాల గుట్టలు


పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తున్న మున్సిపల్ స్థలం

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యన ఉన్న పురపాలక సంఘ స్థలంలో వ్యర్థాలను పోయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీలో మున్సిపల్ స్థలం ఉంది. దీని నిర్వహణ ఏళ్ల తరబడి చేపట్టక పోవడంతో ఆ స్థలంలో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు పెరిగి చిట్టడవిని తలపిస్తూ భయానకంగా ఉంది. బుర్రిపాలెం రోడ్డులోని డంపిగ్ యార్డు వ్యర్థాలతో నిండిపోవడంతో ఆ వ్యర్థాలను బీసీ కాలనీలోని ఖాళీ స్థలంలోకి తరలిస్తున్నారు. అంతేకాకుండా బిల్డింగ్ వ్యర్థాలను రోడ్లపైనే డంప్ చేస్తున్నారు. ఒక పక్క పిచ్చి మొక్కలతో నిండి, మరో పక్క వ్యర్థాలు రోడ్డుపై వేయడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలు ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డంప్ చేసే ప్రాంతంలో పిచ్చి మొక్కల పొదలు ఉండటంతో విష పురుగులకు, సర్పాలకు నిలయంగా మారి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రోజుల తరబడి అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో దోమలు పెరిగి కునుకు లేకుండా చేస్తున్నాయని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు మున్సిపాలిటీలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, ఈ ప్రాంతంలో నివసించేవారికి దినదిన గండంగా ఉందని వాపోతున్నారు. పట్టణంలో పారిశుధ్యం, పరిశుభ్రతలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్న అధికారులకు తమ ప్రాంతంలోని మున్సిపల్ స్థలంలోని అపరిశుభ్ర వాతావరణం కనపడటంలేదా అంటూ ఆ ప్రాంతవాసులు మున్సిపల్ అధికారుల తీరును తప్పుపడుతున్నారు. అధికారులు ఇళ్ల మధ్య డంప్‌ను, పిచ్చిమొక్కలు తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రపర్చాలని కోరుతున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతాన్ని పార్కుగా తీర్చిదిద్దుతారని తెలిపారని దీనిపై దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విషకీటకాల భయం: లక్ష్మి


స్థానికురాలు లక్ష్మి

కొన్నేళ్ల నుంచి బీసీ కాలనీలో నివాసముంటున్నాం. నివాసలకు సమీపంలో ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలతో భయానకంగా ఉంది. అందులో నుంచి పాములు వస్తుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నాం. వర్షం వస్తే వ్యర్థాలతో కలుషిత నీరు ఖాళీస్థలంలో నిలిచి బయటకు అడుగు బయటకు పెట్టే పరిస్థితి లేకుండా ఉంటోంది. మున్సిపల్ అధికారులకు తమ కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టి పరిష్కరించాలి.

భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ సభలు

● ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్


రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ నాగభూషణం

తెనాలి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరపరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తోందని ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్ చెప్పారు. గురువారం మండలంలోని అంగలకుదురులో తహసీల్దార్ గోపాలకృష్ణ, గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, పలువురు అధికారులతో కలిసి రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు రైతులు వివిధ సమస్యలతో 27 అర్జీలు అందించారు. అందులో సర్వేకి 14 రాగా, పాస్‌బుక్, రెవెన్యూ ఇతర సమస్యలతో 12, గ్రామంలో పందుల సమస్యపై మరొకటి వచ్చాయని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

గ్రామస్థుల అర్జీలను పరిష్కరించేందుకు అంగలకుదురులోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు గురువారం పర్యటించారు. గ్రామసభలో వచ్చిన రైతుల అర్జీలను ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణ, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణంలతో కలిసి గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో సమస్యలపై మాట్లాడారు. అనంతరం నాగభూషణం మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో రీ సర్వే, ఇతరత్రా నిబంధనలతో భూ సమస్యలను పరిష్కరించకుండా రైతులను ముప్పుతిప్పలు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొన్నూరులో 53 అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో 53అర్జీలు దాఖలైనట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. సదస్సులో మ్యుటేషన్ కోసం 14, పాస్ పుస్తకాల కోసం 3, ఎఫ్‌లైన్ దరఖాస్తులు 27, అడంగల్ కరెక్షన్ కోసం 1, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం 2, డిజిటల్ సిగ్నేచర్ కోసం 4, కుల ధ్రువీకరణ 1, ఆదాయ ధ్రువీకరణకు 1 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ సదస్సులో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో నిలిచిన వంగవీటి

రంగారాధా మిత్రమండలి అధ్యక్షుడు నరేంద్ర



వంగవీటి మోహనరంగా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శివకుమార్, వైసీపీ నాయకులు, కాపుసంఘం నాయకులు

తెనాలి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదల గుండెల్లో నిలిచిన వ్యక్తి దివంగత వంగవీటి మోహనరంగా అని రంగారాధా మిత్రమండలి అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర అన్నారు. మండలంలోని కొలకలూరులో నసీమా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బీజేపీ ఆర్టీఐ సెల్ జిల్లా కన్వీనర్ కాశిశెట్టి రమేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రంగారాధా మిత్రమండలి అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర గ్రామంలోని మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహనరంగా ప్రజల కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుద్దపల్లి నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ, జనసేన నాయకులు అమ్మిశెట్టి హరికృష్ణ, దార్ల మహేష్, తోట నరేంద్ర, బండి చంద్రమోహన్, మోదుకూరి భాస్కరరావు, సుద్దపల్లి మోజేష్, గొల్లపూడి వెంకటేశ్వరరావు, ధూళ్ల ఇంద్ర, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషిగా నిలిచిన రంగా: అన్నాబత్తుని

● తెనాలి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సుకు అనునిత్యం తపించే మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడు దివంగత వంగవీటి మోహనరంగా అని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటిమోహనరంగా 36వ వర్ధంతిని పురస్కరించుకుని వైసీపీ నాయకుడు కఠారి హరీష్ ఆధ్వర్యంలో పట్టణంలోని రామలింగేశ్వరపేటలోని వంగవీటిమోహనరంగా విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మాలేపాటి హరిప్రసాద్, కాళిదాసు వెంకటేశ్వరరావు, బి. దుర్గాప్రసాద్ పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ కోటేశ్వరరావు

● తెనాలి అర్బన్: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నందులపేట 5వ వార్డులో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వల్లెం మురళి, వేణు, కాలేషా, శ్రీను, హరికృష్ణ, హరి, రాంబాబు, రవికాంత్, న్యాయవాది గౌరీశంకర్ పాల్గొన్నారు. రామలింగేశ్వరపేటలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ, రంగా జీవితమంతా ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. సుబ్రహ్మణ్యం, శివయ్య, యశ్వంత్‌కుమార్, సాయి పాల్గొన్నారు.

● పెదకాకాని: మండలంలో వంగవీటి మోహనరంగ 36 వర్ధంతిని మండల కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గురువారం జరిగాయి. పలుచోట్ల పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయ్ శంకర్, సిద్ధు, గోపి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో పేదలకు దుప్పట్లు పంపిణీ


కొల్లిపరలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ యువసేన కమిటీ సభ్యులు

కొల్లిపర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో ఎన్టీఆర్ యువసేన ఆధ్వర్యంలో గురువారం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు భీమవరపు ఎన్టీఆర్ కోటిరెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ యువసేన పేద ప్రజలను ఆదుకోవడం ఎల్లప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. 18 సంవత్సరాల నుంచి ఎన్టీఆర్ యువసేన ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు మర్రెడ్డి సుధాకర్‌రెడ్డి, యువసేన కమిటీ సభ్యులు షేక్ మస్తాన్, ఆరిమండ ప్రకాశరెడ్డి, బాహాటం సామ్రాజ్యం, టీడీపీ నాయకులు ఆళ్ల వీరారెడ్డి, అద్దంకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సుబ్రహ్మణ్యంకు సత్కారం


పారిశ్రామిక వేత్త సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ఆర్టీవో రాఘవరావు తదితరులు

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అవిరళ కృషితో కుమార్ పంప్స్ సంస్థల యజమాని కొత్త సుబ్రహ్మణ్యం పారిశ్రామికవేత్తగా ఎదిగారని రవాణాశాఖ అధికారి రాఘవరావు చెప్పారు. సుల్తానాబాద్‌లోని ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం ఆయన 73వ జన్మదినం సందర్భంగా కొత్త సుబ్రహ్మణ్యంను ఆర్టీవో, పలువురు అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్టీవో రాఘవరావు మాట్లాడుతూ, ఎంతో ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే నైజం, కార్మికులను ఆదరించే తీరు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేత ములకా శివసాంబిరెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, రాంచంద్, శ్రీనివాసకుమార్, కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం

పొన్నూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతర పోరాటం సాగిస్తుందని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా గురువారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో సీపీఐ పతాకావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ 1925 డిసెంబర్లో కాన్పూర్ వేదికగా భారత కమ్యూనిస్టు పార్టీ పురుడు పోసుకుందని తెలిపారు. జాతీయ ఉద్యమంలో స్వతంత్రం కోసం సీపీఐ పోరాటం సాగించినట్లు గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కార్మికుల హక్కుల కోసం పోరాడినట్లు వివరించారు. నిరంతర పోరాటాల ద్వారా వందేళ్లు సీపీఐ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, గుంటూరు ఏడుకొండలు రత్నబాబు, బాజీ, నాగరాజు, సురేష్, ది గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని కోదండ రామస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణుడు గోదాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు నారాయణస్వామి, శివానందకుమార్, ఆంజనేయప్రసాద్, అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, లక్ష్మీనారాయణ, పూర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


స్వామివార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

అభ్యంతరకరంగా వైసీపీ ఫ్లెక్సీలు


వైకుంఠపురం ఆలయం ముంగిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తెనాలి అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయం ముందు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వైకుంఠపురం ఆలయం వద్ద ఉన్న హోర్డింగ్‌కు జగన్ జన్మదినోత్సవం సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీపై ఇటీవల విడుదల అయిన సినిమా డైలాగ్‌ను మార్చి ఏర్పాటుచేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయి. వైసీపీ నాయకుల తీరుపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఓటీపీలు చెప్పి మోసపోకండి

● త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు




త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పరిచయంలేని వ్యక్తులకుగాని, ఫోన్‌లలో ఓటీపీ, పిన్ నెంబర్ లేదా సీవీవీని చెప్పవద్దని అలా చెపితే ఖాతాలోని నగదు చోరీకి గురయ్యే ప్రమాదముందని త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు చెప్పారు. గురువారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో సైబర్ నేరాలు గురించి తెలిపిన వివరాలు.

ప్రశ్న: సైబర్ నేరగాళ్లు మోసాలకు ఎలా పాల్పడుతున్నారు?

జవాబు: సైబర్ నేరగాళ్లు పలు విధాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. అందుకు మొదటిది ఏటీఎం, క్రెడిట్ కార్డులు ఉన్న వినియోగదారులకు బ్యాంకు, పోలీసులమంటూ పార్శిల్ వచ్చిందంటూ ఓటీపీని పంపామని కోడ్ చెప్పాలని కోరతారు అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలి.

ప్రశ్న: ఓటీపీ చెబితే ఏమవుతుంది ?

జ: ఓటీపీ తెలిపితే సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలోని నగదు ఖాళీ చేస్తారు. క్రెడిట్ కార్డ్ అయితే కార్డు లిమిట్ ఉన్నంత వరకు బదిలీ చేసుకుంటారు.

ప్రశ్న: ఇలాంటి మోసాలు ఇప్పుడు ఎలా ఉన్నాయి?

జ: దాదాపుగా గత రెండు సంవత్సరాల నుంచి పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాలు పెరిగాయి. ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాలవారిని టార్గెట్ చేస్తూ రుణాలు ఇప్పిస్తామని ఆశలు కలుగజేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి కేసులు జిల్లా వ్యాప్తంగా లెక్కలేనన్ని జరిగాయి.

ప్రశ్న: వీటిపై ఎవరికి ఫిర్యాదు చేయాలి?

జ: సైబర్ క్రైమ్ పోలీసులకు 1930లో గాని, దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో గాని ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు చేపడతాం.

ప్రశ్న: సైబర్ మోసాల బారిన పడకుండా ఎలా జాగ్రత్తపడాలి ?

జ: బ్యాంకులనుగాని, పోలీసులమని, ఇతర తెలియని నెంబర్ల నుంచి ఫోన్లు చేసి ఓటీపీ చెప్పాలంటూ వచ్చిన ఫోన్‌లకు చెప్పకపోవడమే మేలు.



బస్టాప్‌కు అడ్డంగా నిలిపిఉంచిన ఆటోలు

బస్టాప్‌కు అడ్డంగా ఆటోలు

తెనాలి క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెనాలి మార్కెట్ సెంటర్‌లోని బస్టాప్‌కు అడ్డంగా నిలిపి ఉంచుతుండటంతో బస్సులు ఆగి ప్రయాణికులను ఎక్కించుకోవడానికి కూడా అవకాశం లేకుండా ఉంది. బస్టాప్‌కు అడ్డంగా ఆటోలను నిలిపి ఆ ప్రాంతాన్ని ఆటోస్టాండ్‌గా మార్చారు. ఆర్టీసీ అధికారులు గతంలో దీనిపై పోలీసులు దృష్టికి తీసుకువెళ్లినా పోలీసుల నుంచి స్పందన లేదు. బస్సులు బస్టాప్ వద్ద కాకుండా దూరంగా ఆపుకోవలసి రావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాప్‌కు అడ్డంగా ఆటోలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులు రబీ పంటలకు బీమా చేయించుకోవాలి: ఏవో

పొన్నూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రబీలలో పంటలు సాగు చేసే రైతులు ఈ నెల 31వ తేదీలోగా పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దేగల వెంకట్రామయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని ములుకుదురు, మాచవరం గ్రామాలలో వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రబీ పంటలు మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల బీమా పథకం అవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్ వద్ద గ్లోసైన్ బోర్డు ఏర్పాటు



డివైడర్ వద్ద ఏర్పాటు చేసిన గ్లోసైన్ బోర్డు

పొన్నూరు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రమాదకరంగా మారిన డివైడర్ వద్ద గురువారం రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. భావనారాయణ స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన డివైడర్ ఎటువంటి హెచ్చరిక బోర్డు లేకపోవడంతో రాత్రివేళ ప్రయాణించే వాహనాలు ప్రతిరోజూ డివైడరును ఢీ కొని ప్రమాదాలకు గురవుతున్నాయి. బుధవారం రాత్రి కూడా ప్రమాదం జరగడంతో కారు ధ్వంసమైంది. దీనిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన ప్రమాదకరంగా డివైడర్ కథనంపై స్పందించిన అధికారులు గ్లోసైన్ బోర్డును ఏర్పాటు చేశారు. త్వరలో శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు అధికారులు తెలిపారు.

తక్కెళ్ళపాడులో వైద్య శిబిరం

పెదకాకాని, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు వారు సిబార్ వైద్య కళాశాల సౌజన్యంతో గురువారం నిర్వహించిన దంత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కోస్టల్ బ్యాంక్ 25వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. సిబార్ దంత వైద్యులు రోగులను పరీక్షించి, టూత్ పేస్టులు, బ్రష్‌లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.